






పారదర్శకతకు పాతర

పోలీసుశాఖలో కిందిస్థాయి అధికారుల సీక్రెట్ ఆపరేషన్స్

ఖమ్మం పోలీసు కమిషనరేట్ పరిధిలో కొందరు అధికారులు దారి తప్పుతున్నారు. శాఖ ప్రతిష్టను ప్రజల్లో పలుచన చేసేలా వ్యవహరిస్తున్నారు. విధి నిర్వహణలో పారదర్శకతను పాతరపెట్టి ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తునట్టు ఆరోపణలున్నాయి. ప్రతీ కేసును పారదర్శకంగా విచారించాలి. ప్రతీ కేసుకు సంబంధించిన సమాచారంలోనూ పారదర్శకత లోపించకూడదు ఇవి ప్రతీసారి జరిగే పోలీసు అధికారుల సమీక్షలో జిల్లా బాస్ చెప్పే మాటలు. కానీ జిల్లాలోని పలు పోలీస్ స్టేషన్లలో అలాంటి పారదర్శకతకు పాతరేస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఉన్నతాధికారుల మాటలను బుట్టదాఖలు చేస్తూ తమకు అనుకూలంగా ఉండే కేసుల విషయాలను మాత్రమే బహిర్గతం చేస్తున్నారన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

ఖమ్మం, జూలై 12 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత పోలీస్ కమిషనర్ చట్ట వ్యతిరేక కార్యక్రమాలపై ఉక్కుపాదం మోపుతున్న నేపథ్యంలో బాధితులకు న్యాయం జరిగేలా పలు రకాల చర్యలు చేపడుతున్నారు. లా అండ్ ఆర్డర్ విషయాల్లో తన మార్క్ చూపుతూనే భూ దందాల్లో సైతం సరైన రీతిలో విచారణ జరిపి కేసులు నమోదు చేయించి రిమాండ్‌కు పంపేలా విచారణ చేయిస్తున్నారు. అయితే దాన్ని ఆసరాగా చేసుకుంటున్న కొందరు ఎస్‌హెచ్‌వోలు, ఎస్‌ఐ స్థాయి అధికారులు తమ స్వకార్యాలు చక్కబెట్టుకుంటున్నట్టు ఆరోపణలు లేకపోలేదు. తాము సెటిల్‌మెంట్ చేయాలనుకున్న కేసుల విషయాలను బయటకు పొక్కకుండా జాగ్రత్త పడటంతోపాటు, కేసులకు సంబంధంలేని వ్యక్తులను, తాము చెప్పినట్టు నడుచుకోని వ్యక్తుల విషయాల్లో ఇష్టారీతిన వ్యవహరిస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నారన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

పాతుకుపోయిన సిబ్బంది

నిఘా వర్గాలైన ఎస్బీ, ఇంటెలిజెన్స్ విభాగాల్లో కొందరు సిబ్బంది ఏళ్ల తరబడి అక్కడే పాతుకుపోయారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆయా విభాగాల్లో పనిచేస్తున్న వారిలో కొందరు ఏడేళ్లకు మించి పని చేస్తున్నారంటే అతిశయోక్తి కాదు. అలాంటి వారు రెండు విభాగాల్లోనూ పదులసంఖ్యలో ఉన్నట్టుగా తెలుస్తోంది. కొందరు అక్కడే కానిస్టేబుల్ పనిచేసి, అక్కడే హెడ్‌కానిస్టేబుల్, అక్కడే ఏఎస్‌ఐలుగా కూడా పనిచేస్తుండటం గమనార్హం. అయితే ఆ రెండు విభాగాల వారు నేరుగా ఉన్నతాధికారులకు సమాచారం అందించాల్సి ఉంటుంది. కాగా సదరు సిబ్బంది ఏళ్ల తరబడి పాతుకుపోవడంతో స్టేషన్లలో పనిచేస్తున్న వారితో లింకులు ఏర్పాటు చేసుకుని వారికి అనుకూలంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

అంతేకాదు ఉన్నతాధికారులు అంతర్గత సమీక్షలో చెప్పిన విషయాలను సైతం సదరు వ్యక్తులు బయటకు చేరవేస్తున్నారన్న విమర్శలు లేకపోలేదు. కొందరు అధికారులపై నేరుగా ఉన్నతాధికారుల వద్దకు ఫిర్యాదులు వెళ్లిన సమయంలో వారు గుట్టుచప్పుడు కాకుండా విచారణ చేయమన్న విషయాలను సైతం ఆయా ఆరోపణలు ఎదుర్కొనే అధికారులకే చేరవేస్తున్నారన్న ఆరోపణలు లేకపోలేదు. ఇక తమకు అనుకూలంగా నడుచుకుని వారిమీద మాత్రమే నివేదికలు ఇస్తారన్న ఆరోపణలు ఉన్నాయి. అంతేనా సంబంధిత స్టేషన్లలోని వారికి అనుకూలంగా వ్యవహరించినందుకుగాను నెలవారీగా కొద్దిమొత్తాల్లో మామూళ్లు అందుకుంటున్నారన్న ప్రచారం జరుగుతోంది. ఇక ఏదైనా ప్రత్యేక కేసు విషయంలో అయితే అందినకాడికి జేబులు నింపుకొంటారన్న ఆరోపణలు లేకపోలేదు. ఇప్పటికైనా ఆయా విభాగాల్లో పాతుకుపోయిన సిబ్బందిని పక్కనపెట్టడంతోపాటు, స్టేషన్లలో అధికారులు పారదర్శకత పాటించాలని ప్రజలు కోరుతున్నారు.

- స్టేషన్లలో బయటకు పొక్కని సమాచారం
- కేసులతో సంబంధాలు లేనివారికి వేధింపులు
- నిఘావర్గాల్లో లోపించిన నిష్పాక్షికత
- ఎస్బీ, ఇంటెలిజెన్స్‌లలో పాతుకుపోయిన సిబ్బంది

ఆ స్టేషన్ రూటే సప'రేటు'...

ఖమ్మం నగరంలోని ఓ పోలీస్ స్టేషన్‌లో గతంలో పనిచేసిన సీఐ.. ఓ విలేకరి కేసు విషయంలో ఆయుధాల చట్టంతోపాటు పలు సెక్షన్లతో బెదిరించి పంచనామాలో సంతకాలు చేయించి తప్పుడు కేసు నమోదు చేయడంతోపాటు కోర్టును తప్పుదోవ పట్టించడంతో ఆయనను సస్పెండ్ చేశారు. అదే స్టేషన్‌లో ఓ కుటుంబ ఆర్థిక వివాదం విషయంలో లంచం తీసుకుంటూ ఓ హెడ్ కానిస్టేబుల్ ఏకంగా ఏసీబీ అధికారులకు పట్టుబడ్డారు. అయినప్పటికీ సదరు స్టేషన్‌లోని అధికారులు తమ తీరుమార్చుకోలేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పలు సివిల్ కేసుల విషయంలో తమకు అనుకూలంగా ఉన్నవారికి వత్తాసు పలుకుతూ ఇబ్బందులకు గురిచేస్తున్నారన్న విషయంపై నేరుగా ఉన్నతాధికారికే వినతి సమర్పించుకున్న సంఘటనలు లేకపోలేదు.

ఇక సదరు స్టేషన్‌లోని మరికొందరు ఎస్‌ఐ స్థాయి సిబ్బంది... కేసులతో సంబంధం లేనివారిని సైతం స్టేషన్‌కు రావాలని పిలిపిస్తూ వేధింపులకు గురిచేస్తున్నారన్న విమర్శలు లేకపోలేదు. అయితే స్టేషన్లలో, సమాజంలో జరుగుతున్న పలు అక్రమాలు ఇతర సంఘటనలపై నిఘాపెట్టి ఉన్నతాధికారులకు సమాచారం చేరవేసే విభాగాలు మాత్రం వాటిని గాలికొదిలేశారన్న ప్రచారం జరుగుతోంది. సదరు స్టేషన్‌లో అవినీతికి పాల్పడుతున్న అంశాన్ని కానీ, స్టేషన్‌లో తప్పుడు కేసు నమోదయ్యే విషయంపై ఫిర్యాదు వెళ్లేవరకు కానీ ఉన్నతాధికారులకు నిఘావర్గాలు ఎలాంటి సమాచారం ఇవ్వకపోవడమే నిదర్శనంగా కనిపిస్తోంది.



మణుగూరు 'నయాగరా'....

జలపాతం.. ఎవరికైనా కన్నులపండుగే. గుట్టలపై నుంచి దూకే జలధారలు చూపరులను అబ్బురపరుస్తాయి.. ఆ హోరు జోరు తన్మయభరితులను చేస్తాయి.. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని మణుగూరు చెంతన అటవీ ప్రాంతంలో విస్తరించిన రథంగుట్ట వద్ద వంద అడుగుల పైనుంచి దూకుతున్న జలపాతం ఇప్పుడు అందరినీ ఆకట్టుకుంటోంది. గత వారం రోజులుగా వర్షాలు పడుతుండడంతో ఈ జలపాతం హోరెత్తుతోంది. స్థానికులు దీనిని వెన్నెల జలపాతం అని పిలుస్తారు. పట్టణ ప్రధాన రహదారిలోని హనుమాన్ టెంపుల్ నుంచి అటవీ మార్గంలో దాదాపు రెండు కిలోమీటర్లు ప్రయాణిస్తే ఈ జలపాతాన్ని చేరుకోవచ్చు. అటవీశాఖ వారు ఈ ప్రాంతాన్ని అర్బన్ పార్కుగా తీర్చిదిద్దడంతోపాటు పర్యాటకుల రాకపోకలకు వసతులు ఏర్పాటు చేశారు. విశ్రాంతి తీసుకునేందుకు కుటీరాలు సైతం ఏర్పాటు చేశారు. ఇంకెందుకు ఆలస్యం.. వానాకాలంలో ఓ రోజు ప్లాన్ చేసుకొని వెన్నెల జలపాతాన్ని తిలకించి పులకించండి..!

-మణుగూరు



నగరంలో భారీ వర్షం

ఖమ్మం కార్పొరేషన్, జూలై 12: ఖమ్మంలో శుక్రవారం సాయంత్రం నుంచి రాత్రి వరకు భారీవర్షం కురిసింది. ఉదయం ఎండగా ఉండి 39 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదయింది, కాగా సాయంత్రానికి మబ్బులు పట్టి కొద్దిపాటి వర్షం కురిసింది. తరువాత రాత్రి 7-30 గంటలనుంచి భారీగా వర్షం కురిసింది. సుమారు గంటన్నరకు పైగా వర్షం పడడంతో పలుప్రాంతాల్లో వర్షపునీరు రహదారులపై ప్రవహించింది. వర్షం కురవటంతో ఉక్కపోతగా ఉన్న వాతావరణం చల్లగా మారింది.



కిన్నెరసానికి వరద ప్రవాహం

400 అడుగులు దాటిన నీటిమట్టం

పాల్వంచ రూరల్, జూలై 12 : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ మండలంలోని కిన్నెరసాని జలాశయానికి ఎగువ ప్రాంతం నుంచి వరద ప్రవాహం పెరుగుతోంది. శుక్రవారం ప్రాజెక్టు నీటిమట్టం 400.40 అడుగులకు పెరిగింది. మహబూబాబాద్, ఇల్లెందు, పాకాల కొత్తగూడెం ప్రాంతాల నుంచి వరదనీరు పెరగడంతో ఇల్లెందు, టేకులపల్లి, కొత్తగూడెం ప్రాంతాల నుంచి వరద చేరుతోంది. 12 క్యూసెక్కుల చొప్పున నీరు చేరడంతో నీటిమట్టం పెరుగుతోంది. అసలు సామర్థ్యం 407 అడుగులు కాగా 400.40 అడుగులకు నీరు చేరడంతో ఇంకా పెరిగే అవకాశం ఉందని ప్రాజెక్టు అధికారులు అప్రమత్రమయ్యారు.

'పొదెం' బాధ్యతల స్వీకరణ

- పాల్గొన్న మంత్రులు ఉత్తమ్, శ్రీధర్‌బాబు, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు, చైర్మన్‌లు
- భారీగా తరలివచ్చిన కాంగ్రెస్ శ్రేణులు

భద్రాచలం, జూలై 12 : రాష్ట్ర అటవీ అభివృద్ధి కార్పొరేషన్ లిమిటెడ్ చైర్మన్‌గా ఏఐసీసీ సభ్యుడు, కాంగ్రెస్ భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు పొదెం వీరయ్య బాధ్యతలు చేపట్టారు. హైదరాబాద్‌లో గురువారం ఆయన అధికారికంగా బాధ్యతలు స్వీకరించగా.. భద్రాద్రి దేవస్థానానికి చెందిన అర్చకులు, వేద పండితులు ప్రత్యేక పూజలు చేసి ఆశీర్వచనం అందజేశారు. ఈ సమయంలో అటవీ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్‌గా టీజీఎఫ్‌టీసీ ఎండీ, వైస్ చైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి, పర్యాటక ఈడీ రంజిత్‌నాయక్ వీరయ్యచే రికార్డులపై సంతకం చేయించడంతో చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టారు. మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు పాల్గొని అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు పాయం వెంకటేశ్వర్లు, జారె ఆదినారాయణ, డాక్టర్ తెల్లం వెంకట్రావు, రాందాస్‌నాయక్, గిడ్డంగుల కార్పొరేషన్ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, ట్రైకార్ చైర్మన్ బెల్లయ్యనాయక్, హస్తకళల చైర్మన్ నాయుడు సత్యం, మాజీ ఎమ్మెల్యే చందా లింగయ్య దొర పాల్గొన్నారు.



హైదరాబాద్‌లో బాధ్యతలు స్వీకరిస్తున్న పొదెం వీరయ్య

నాకంటే మంచి పోస్టులో ఉండేవారు...

ఈసారి జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో భద్రాచలం అసెంబ్లీ కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన పొదెం వీరయ్య గెలిచి ఉంటే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వంలో నాకంటే మంచి పోస్టులో ఉండేవారని ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు వ్యాఖ్యానించారు. పొదెం ప్రమాణస్వీకార వేడుక సందర్భంగా నిర్వహించిన అభినందన సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ నేతలు సోనియా, రాహుల్, ప్రియాంకలు ఏ విధంగా కాంగ్రెస్‌ను విడిచి వెళ్లలేరో అదేవిధంగా వీరయ్య వైఖరి ఉంటుందన్నారు. ఎంతమంది కాంగ్రెస్‌ను వీడినా మూడు రంగుల కాంగ్రెస్ జెండాను వీడని అసలైన కాంగ్రెస్ వాది వీరన్న అని అన్నారు.



ఖమ్మంలో సమీక్షలో మాట్లాడుతున్న జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు హుస్సేన్‌నాయక్

గిరిజనుల కేసులపై వెంటనే స్పందించాలి

- సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి
- జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోత్ హుస్సేన్
- కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్ష సమావేశం

ఖమ్మం, జూలై 12 (ఆంధ్రజ్యోతి): గిరిజనుల కేసులపై వెంటనే స్పందించాలని, వారి సమస్యల సత్వర పరిష్కారానికి అధికారులు చర్యలు తీసుకోవాలని జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోత్ హుస్సేన్‌నాయక్ అన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్‌తో కలిసి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న గిరిజనుల సంక్షేమ పథకాలపై అధికారులతో ఆయన శుక్రవారం సమీక్ష నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్టీ సబ్ ప్లాన్ కింద ఎన్ని నిధులు మంజూరు అయినది, ఖర్చు, మిగులుపై పూర్తి నివేదిక సమర్పించాలన్నారు. గిరిజనుల సంక్షేమం కోసం జాతీయస్థాయిలో ఎస్టీ కమిషన్ పనిచేస్తుందన్నారు. గిరిజన హాస్టళ్లను గురుకులాలుగా మార్చి, సౌకర్యాలు కల్పించాలన్నారు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు అడిగిన చోట్ల, ప్రవేశ పరీక్షలతో సంబంధం లేకుండా సీట్లు కేటాయించాలన్నారు. అంబేద్కర్ ఓవర్సీస్ విద్యా పథకం అమలుపై, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులు మంజూరు, ఖర్చు, మిగులుపై పూర్తి నివేదిక సమర్పించాలన్నారు. ట్రైకార్ పథకం లబ్ధిదారులను గ్రామసభల ద్వారా ఎంపిక చేయాలన్నారు. పోడు పట్టాల విషయంలో తగిన చర్యలు తీసుకోవాలన్నారు. కొన్ని చోట్ల పోడు సాగుచేస్తున్నా పట్టాలు లేవని, పరిశీలించి న్యాయం చేయాలన్నారు. అంగన్‌వాడీలకు భవనాలు, వసతులు కల్పించాలన్నారు. గిరిజన వికాసంపై పెద్ద ఎత్తున అవగాహన కల్పించాలన్నారు.

పాఠశాలల్లో పరిశుభ్రంగా ఉంచే స్వీపర్లు లేరని, క్లీనింగ్, నిర్వహణకు చర్యలు తీసుకోవాలన్నారు. భూసార పరీక్షల

(మిగతా 4వ పేజీలో)

పాలేరు జేఎన్‌టీయూకు

మహర్దశ?

- ఈ ఏడాది నుంచి పూర్తిస్థాయిలో అడ్మిషన్లు
- శాశ్వత భవనాలకు మోక్షం ఎప్పుడో..
- జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాలలపై హైదరాబాదులో నేడు ముఖ్యమంత్రి సమీక్ష

4

ఖమ్మం, మహబూబాబాద్ జేఎన్‌టీయూహెచ్ అనుబంధ కళాశాలల్లో ఈ ఏడాది నుంచి పూర్తిస్థాయిలో సీట్లు అందుబాటులోకి రానున్నాయి. ఐదు బ్రాంచ్‌లలో 60చొప్పున మొత్తం 300 అడ్మిషన్లు కన్వీనర్ కోటాలో భర్తీ కానున్నాయి. ఇప్పటికే ప్రారంభమైన తొలివిడత కౌన్సెలింగ్‌లో రోడ్డు, రైలు మార్గాలకు ఎంతో అనువైన ఈ రెండు కళాశాలలకు ఆప్షన్లు ఇస్తున్నారు. కాగా ఈ రెండు కళాశాలలు తాత్కాలిక భవనాల్లోనే కొనసాగుతున్నాయి. స్థల కేటాయింపు జరిగినా శాశ్వత భవనాలు సమకూరలేదు. శనివారం రాష్ట్రంలో జేఎన్‌టీయూతో పాటు అనుబంధ ఇంజనీరింగ్ కళాశాలలపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శనివారం సమీక్షించబోతున్నారు. ఈ నేపథ్యంలో జేఎన్‌టీయూ కాలేజీలకు భవనాలు, ల్యాబ్‌ల నిర్మాణానికి నిధులు కేటాయింపు జరిగే అవకాశం లేకపోలేదు.

- ఆంధ్రజ్యోతి ప్రతినిధి, ఖమ్మం

రేమిడిచర్లలో డ్రోన్ యంత్రాల పరీక్షా కేంద్రం

- స్థలాన్ని పరిశీలించిన కేంద్ర అధికారులు
- అనుకూలతలను వివరించిన కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

4

వైద్య ఆరోగ్యశాఖలో బదిలీల సందడి

- సీనియర్ ఉద్యోగులకు తప్పని స్థానభ్రంశం
- 878 పోస్టులు, 504 ఖాళీలు
- వీవీపీ పరిధిలో 1180 మంది

కొనసాగుతున్న ఎప్‌సెట్ కౌన్సెలింగ్

ఖమ్మం ఖానాపురంహవేలి, జూలై 12: నగరంలోని ఎస్ఆర్‌బీజీఎన్ఆర్ డిగ్రీ కళాశాలలో ఎప్‌సెట్ కౌన్సెలింగ్ కొనసాగుతోంది. కౌన్సిలింగ్‌లో శుక్రవారం మొత్తం 480 మంది స్లాట్ బుకింగ్ చేసుకోగా 470 మంది విద్యార్థులు సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు హాజరైనట్లు కోఆర్డినేటర్ సుబ్రహ్మణ్యం తెలిపారు. ఈ మెదటి దశ కౌన్సిలింగ్ ఈ నెల 15 వరకు కొనసాగుతుందని తెలిపారు.

దోస్త్ కౌన్సిలింగ్ గడువు పొడిగింపు

2024-25 విద్యా సంవత్సరంలో మూడు ఫేజుల్లో దోస్త్ ద్వారా సీట్లు పొందిన విద్యార్థుల సర్టిఫికెట్ల పరిశీలన గడువు ఈనెల 18వరకు పొడిగించినట్టు కళాశాల ప్రిన్సిపాల్ మహ్మద్ జాకీరుల్లా తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగించుకోవాలని సూచించారు.

సివిల్ సర్వీసెస్‌కు ఉచిత శిక్షణకు దరఖాస్తులు

ఖమ్మం సంక్షేమ విభాగం, జూలై 12: హైదరాబాద్ బంజారాహిల్స్‌లో సాంఘిక సంక్షేమశాఖ ఆధ్వర్యంలో యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ ఉచిత శిక్షణ కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సాంఘిక సంక్షేమశాఖ డీడీ కస్తాల సత్యనారాయణ శుక్రవారం తెలిపారు. గతంలో వెల్లడించిన నోటిఫికేషన్‌లో ఈనెల 10వరకు గడువు ప్రకటించారని, కానీ అభ్యర్థుల కోరిక మేరకు గడువును ఈనెల 31వరకు ప్రభుత్వం పెంచినట్లు తెలిపారు. అభ్యర్థులు టీజీ స్టడీసర్కిల్ ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేయాలని, పూర్తి వివరాలకు 040 23546552, 8121626423, 9848494290 నెంబర్‌లకు కాల్ చేయాలని సూచించారు.

రామయ్యను దర్శించుకున్న ఏజేఎస్



రామాలయంలో వ్యవసాయ శాఖ జాయింట్ సెక్రటరీ

భద్రాచలం, జూలై 12: భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి వారిని రాష్ట్ర వ్యవసాయ శాఖ జాయింట్ సెక్రటరీ డాక్టర్ యోగితారాణా కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. శుక్రవారం స్వామి వారి దర్శనానికి వచ్చిన యోగితారాణా కుటుంబ సభ్యులకు దేవస్థానం ఈవో రమాదేవి, అర్చక స్వాములు మేళతాళాలతో స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో జరిగిన ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం శ్రీ లక్ష్మీతాయారు అమ్మవారిని, శ్రీ ఆంజనేయస్వామి వారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు శ్రీనివాసరావు, ఆర్ఐ నరసింహారావు, డీఈ రవీందర్ పాల్గొన్నారు.

పాలేరు జేఎన్‌టీయూకు మహర్దశ?

- ఈ ఏడాది నుంచి పూర్తిస్థాయిలో అడ్మిషన్లు
- శాశ్వత భవనాలకు మోక్షం ఎప్పుడో ...
- నేడు జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాలలపై హైదరాబాదులో ముఖ్యమంత్రి సమీక్ష



తాత్కాలిక భవనంలో నిర్వహిస్తున్న పాలేరు ఇంజనీరింగ్ కళాశాల

ఖమ్మం, జూలై12(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): గతేడాది రాష్ట్ర ప్రభుత్వం మంజూరుచేసి ప్రారంభించిన జేఎన్‌టీయూ పాలేరు ఇంజనీరింగ్ కాలేజీలో ఈఏడాది పూర్తిస్థాయి అడ్మిషన్లు జరగబోతున్నాయి. అయితే పూర్తిస్థాయి భవనాలు ఏర్పాటుకు ప్రభుత్వం సత్వరం దృష్టిపెట్టాల్సిన అవసరం ఉంది. రాష్ట్రంలో జేఎన్‌టీయూ యూనివర్శిటీతో పాటు అనుబంధ ఇంజనీరింగ్ కళాశాలలపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శనివారం సమీక్షించబోతున్నారు. ఈనేపథ్యంలో పాలేరు జేఎన్‌టీయూ కాలేజీకి భవనాలు, ల్యాబ్‌ల నిర్మాణానికి నిధులు కేటాయింపు జరిగే అవకాశం లేకపోలేదు.

గత ప్రభుత్వం ఇంజనీరింగ్ కౌన్సెలింగ్ ముగింపు తరుణంలో పాలేరు, మహబూబాబాద్‌కు రెండు జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కాలేజీలు మంజూరు చేసింది. అప్పటికే మూడు కౌన్సెలింగ్‌లు పూర్తికాగా నాలుగో కౌన్సెలింగ్, స్పాట్ అడ్మిషన్లు మాత్రమే మిగిలి ఉండడంతో సీఎస్ఈ, డేటా సైన్సులకు మాత్రమే అనుమతి ఇచ్చారు. ఇందులో రెండు గ్రూపులు కలిపి 50 వరకు అడ్మిషన్లు జరిగాయి. ఖమ్మం రూరల్ మండలంలోని మద్దులపల్లిలోని ఐటీడీఏ ఒకేషనల్ సెంటర్ ట్రైనింగ్ భవనంలో కొంత భాగాన్ని జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కాలేజీకి కేటాయించడంతో తరగతులు ప్రారంభమయ్యాయి.

తొలుత ఒక్క బ్రాంచ్ మాత్రమే..

వాస్తవానికి జేఎన్‌టీయూ కళాశాల మంజూరు తరుణంలో సీఎస్ఈ డేటాసైన్సు, ఈసీఈ , మెకానికల్, ట్రిబుల్‌ఈ కోర్సులకు అనుమతి ఇచ్చినా అడ్మిషన్ ప్రక్రియ పూర్తికావడంతో కేవలం సీఎస్ఈ డేటాసైన్సు మాత్రమే అప్పుడు తీసుకున్నారు. ఈ విద్యాసంవత్సరం ప్రారంభంలోనే పాలేరు జేఎన్‌టీయూకి సీఎస్ఈ, డేటాసైన్సు, ఈసీఈ, ట్రిబుల్‌ఈ, మెకానికల్ కోర్సుల ప్రారంభానికి ఒక్కో గ్రూపులో 60 చొప్పన మొత్తం 300 సీట్లు అనుమతి ఇవ్వడంతో విద్యార్థులు ఈగ్రూపులు కూడా కౌన్సెలింగ్‌లో ఆప్షన్లు పెట్టుకుంటున్నారు. గత విద్యా సంవత్సరంలో ప్రారంభమైన సీఎస్ఈ 60, డేటా సైన్సు60 సీట్లు మంజూరుకాగా రెండు గ్రూపులో కేవలం 44 మంది మాత్రమే అడ్మిషన్ల చివరలో జాయిన్ అయ్యారు. మిగిలిన సీట్లను డిప్లొమా నుంచి ఉత్తీర్ణులై బీటెక్‌కు నేరుగా రెండో సంవత్సరంలో వచ్చే విద్యార్థులకు కౌన్సెలింగ్ ద్వారా కేటాయిస్తున్నారు. ఇప్పటికే సీఎస్ఈలోని అన్ని సీట్లు భర్తీకాగా, డేటాసైన్సులో కూడా పూర్తిస్థాయిలో భర్తీ అవుతున్నాయి. దీంతో ద్వితీయ సంవత్సరం సీఎస్ఈ, డేటాసైన్సు పూర్తిస్థాయిలో విద్యాబోధన జరగనుంది. ఈ ఏడాది మొదటి ఏడాది సీఎస్ఈ, డేటా సైన్సు, ఈసీఈ, ట్రిబుల్‌ఈ, మెకానికల్ గ్రూపుల్లో పూర్తిస్థాయిలో విద్యాబోధన జరుగనుంది.

సీఎం సమీక్షకు మంత్రి పొంగులేటి..



ప్రస్తుతం రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పాలేరు నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. మంత్రి పట్టుదలగా పాలేరు జేఎన్‌టీయూపై దృష్టిసారిస్తే నిధులు, స్థలం కేటాయింపు పూర్తిస్థాయి సిబ్బంది నియామకం వెంటవెంటనే జరిగే అవకాశం ఉంది. సీఎం సమీక్షకు రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి హాజరవుతున్నందున పాలేరు జేఎనటీయూకి అవసరమైన సదుపాయాలు, స్థలం కేటాయింపులు, శాశ్వత భవనాలు నిర్మాణం, లెక్చరర్లు, సిబ్బంది నియామకం తదితర సమస్యలు పరిష్కారంచూసే అవకాశం ఉంది. ఆగస్టునెలలో సీఎం రేవంత్‌రెడ్డి ఖమ్మం జిల్లాలో పలు అభివృద్ధి, శంకుస్థాపన కార్యక్రమాలకు పర్యటన ఉండే అవకాశం ఉంది. ఖమ్మంలో ప్రభుత్వ మెడికల్ కళాశాల భవనాలకు శంకుస్థాపన జరిగే తరుణంలోనే పాలేరు జేఎన్‌టీయూ కళాశాల భవనాలకు కూడా శంకుస్థాపన ఉండే అవకాశం ఉందని, అధికారులు భావిస్తున్నారు. ఏది ఏమైనా ప్రభుత్వం దృష్టిసారిస్తే పాలేరు జేఎన్‌టీయూ కళాశాలకు మహార్దశ పట్టనుంది.

రోడ్డు, రైలు మార్గం

హాస్టల్ వసతితో ఇంజనీరింగ్ విద్య జేన్‌టీయూ అందిస్తున్నందున ఉమ్మడి ఖమ్మంతో పాటు రాష్ట్రంలోని పలు జిల్లాల మెరిట్ విద్యార్థులు పాలేరు జేఎనటీయూపై ఆసక్తిచూపుతున్నారు. రైల్వే, బస్సు సౌకర్యం కలిగి ఉండడం పొరుగు జిల్లాల విద్యార్థులకు పాలేరు జేఎన్‌టీయూ సౌలభ్యంగా ఉంది. పాలేరు జేఎన్‌టీయూకి ప్రస్తుత ప్రభుత్వం 30 ఎకరాల స్థలం కేటాయించింది. మొత్తం ఈకాలేజీలో నాలుగేళ్ల పాటు విద్యాతరగతులకు 1200మందికిపైగా చదువుకకునే అవకాశం లభించబోతుంది. ఇంజనీరింగ్‌తో పాటు ఇతర కోర్సుల వస్తే మరో 300మందికి పాలేరులో విద్యాబోధన జరగబోతుంది.

పూర్తిస్థాయి భవనాలుపై దృష్టి

గత విద్యాసంవత్సరం ఇంజనీరింగ్ కౌన్సెలింగ్ ముగింపు తరుణంలో పాలేరు జేఎన్‌టీయూ మంజూరైంది. ఆతర్వాత తాత్కాలిక భవనాల్లో విద్యాతరగతులు ప్రారంభించారు. ప్రస్తుతం మద్దులపల్లి ఐటీడీఏ భవనాలను పూర్తిస్థాయిలో ఇంజనీరింగ్ కాలేజీ నిర్వహణకు తీసుకుంటున్నారు. ఖమ్మం రూరల్ మండలం మద్దులపల్లి వద్ద 30 ఎకరాల వరకు ప్రభుత్వం స్థలం కేటాయించింది. పూర్తిస్థాయిలో భవనాలు నిర్మించాలంటే మరో 30 ఎకరాల వరకు స్థలం అవసరం ఉంది. కళాశాల భవనాలు, క్రీడా మైదానాలు, ల్యాబ్‌లు, హాస్టల్ భవనాలు, లెక్చరర్స్ క్వార్టర్స్ నిర్మాణం చేపట్టాలంటే రూ.500కోట్ల వరకు నిధులు అవసరం ఉంది.

ఈవిద్యాసంవత్సరంలో తాత్కాలిక భవనాల్లో కంప్యూటర్ ల్యాబ్ ఏర్పాటు చేశారు. ఫిజిక్స్, కెమిస్ట్రీ ల్యాబ్‌ల నిర్మాణానికి నిధులు అవసరం ఉంది. అలాగే ప్రస్తుతం కేటాయించిన స్థలానికి ఆనుకుని మరో 20 ఎకరాల వరకు ప్రభుత్వ భూమి ఉంది. మొత్తం భూమి కేటాయిస్తే పాలేరు జేఎన్‌టీయూ యూనివర్సిటీ స్థాయికి అభివృద్ధి చెందే అవకాశం లేకపోలేదు. ఈవిద్యాసంవత్సరంలో భవనాలు, ల్యాబ్‌లు ప్రారంభించాలంటే రూ.100కోట్లవరకు అవసరమని అధికారులు భావిస్తున్నారు.

కేంద్ర ప్రభుత్వం నియంతృత్వ ధోరణితో

బొగ్గుగనుల వేలం

- బొగ్గుబ్లాక్‌ల వేలాన్ని రద్దు చేసి సింగరేణికి కేటాయించకపోతే ఉద్యమం తీవ్రతరం చేస్తాం
- సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు వాసిరెడ్డి సీతారామయ్య, కె. రాజ్‌కుమార్



మాట్లాడుతున్న వాసిరెడ్డి సీతారామయ్య

కొత్తగూడెం, జూలై 12 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం నియంతృత్వ వేలం వేస్తుందని, ఆ వేలానికి నిరసనగా సింగరేణి వ్యాప్తంగా అన్ని జనరల్ మేనేజర్ కార్యాలయాల ముందు నిరాహారదీక్షలు నిర్వహిస్తున్నామని తెలంగాణ వ్యాప్తంగా ఉన్న సింగరేణి బొగ్గుబావులను సింగరేణికి కేటాయించాలని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య, ప్రధానకార్యదర్శి కె.రాజ్‌కుమార్ డిమాండ్ చేశారు. గత 6రోజుల నుంచి సింగరేణి వ్యాప్తంగా ఎఐటీయూసీ యూనియన్ ఆధ్వర్యంలో రిలే నిరాహారదీక్షలు చేపట్టిందన్నారు. శుక్రవారం కొత్తగూడెంలోని సింగరేణి ప్రధాన కార్యాలయం ముందు నిర్వహిస్తున్న రిలేనిరాహారదీక్షలో వారు పాల్గొని మాట్లాడారు. పోరాటాల ద్వారా సింగరేణి సంస్థను కాపాడుకోకపోతే భవిష్యత్‌లో సింగరేణి సంస్థ మనుగడకు ప్రమాదం ఏర్పడుతుందన్నారు. ప్రస్తుతం సింగరేణి ఆధ్వర్యంలో నడుపుతున్న బొగ్గుబావుల్లో బొగ్గు నిక్షేపాలు రోజురోజుకు తగ్గిపోతున్నాయన్నారు. 2030 నాటికి ప్రస్తుత బొగ్గుబావులన్నీ మూతపడే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని తద్వారా ఉపాధి కల్పన కొల్పోయి ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురి కావాల్సి వస్తుందని వారు తెలిపారు. ఒకవేళ కేంద్ర ప్రభుత్వం ఈ విషయంలో స్పందించి బొగ్గు బ్లాక్‌ల వేలాన్ని రద్దుచేసి సింగరేణికి కేటాయించని పక్షంలో ఈ ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని వారు హెచ్చరించారు. సింగరేణి కార్మికుల ఉద్యమాన్ని విజయవంతం చేయడానికి సిద్ధంగా ఉండాలని సింగరేణి వ్యాప్తంగా పని చేస్తున్న కార్మికులకు వారు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ సలహాదారులు దమ్మాలపాటి శేషయ్య, సెంట్రల్ కమిటీ నాయకులు వంగా వెంకట్, బ్రాంచి నాయకులు జె. గట్టయ్య, ఎస్వీ రమణమూర్తి, కిష్టాఫర్, ఎస్. శ్రీనివాస్,సురేందర్, చంద్రయ్య, ఎస్. సుధాకర్, ఎస్. శ్రీనివాస్, కె. రాజేశ్వరరావు, డి. నర్సింహారావు, ఆర్. భరణి, కె.ఉమాయిన్. కె. రాములు, గోపీకృష్ణ, సూర్య ప్రకాష్, అనంత లక్ష్మి, పల్నాటి ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

సాంస్కృతిక శక్తులను కలుపుకొని

ఉద్యమాన్ని బలోపేతం చేయాలి

- ప్రజానాట్యమండలి తెలంగాణ రాష్ట్ర తొలి అధ్యక్షుడు దేవేందర్
- ప్రారంభమైన పీఎన్ఎం రాష్ట్ర రాజకీయ శిక్షణ తరగతులు



జెండాను ఆవివిష్కరిస్తున్న చెరుకుపల్లి

ఖమ్మం సంక్షేమ విభాగం, జూలై 12: ప్రజాస్వామ్య పరిరక్షణకై లౌకికవాద దృక్పథంతో పనిచేసే సాంస్కృతిక శక్తులను కలుపుకొని సాంస్కృతిక ఉద్యమాన్ని బలోపేతం చేయాలని ప్రజానాట్యమండలి తెలంగాణ రాష్ట్ర తొలి అధ్యక్షుడు దేవేందర్ పిలుపునిచ్చారు. శుక్రవారం ఖమ్మం మంచికంటి భవన్‌లో ప్రజానాట్యమండలీ రాష్ట్ర శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. ప్రజానాట్యమండలీ పథకాన్ని సీనియర్ కళాకారుడు చెరుకుపల్లి వెంకటేశ్వర్లు జెండావిష్కరణ చేసి ప్రారంబించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో వక్తలు మాట్లాడుతూ సమాజంలో చాపకిందనీరులా ప్రజల మధ్యలోకి మతోన్మాదం చొచ్చుకుపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటువంటి ప్రమాదాలు సమాజానికి మంచిదికాదన్నారు. ప్రజల మధ్య మత విద్వేషాలు ఏర్పడతాయని అన్నారు. వాటిని తొలగించేందుకు కళాకారులు మరోసారి గజ్జకట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కట్ట నర్సింహం, కుమార్, సుమార్, వేల్పుల వెంకన్న, అవార్సరి గోవర్ధన్, వేముల సదానంద్, ఎంజే వినోద్‌కుమార్, అశన్న, గడ్డం గణేష్, నక్క సైదులు, రౌతు రవి, గుమ్మడి నర్సయ్య, నందిగామ కృష్ణ, మారుతి, కొండల్ పాల్గొన్నారు.

నూతన చట్టాలతో న్యాయ సంక్షోభం

- నల్సార్ యూనివర్సిటీ ప్రొఫెసర్ మురళీకర్ణం



మాట్లాడుతున్న నల్సార్ యూనివర్సిటీ ప్రొఫెసర్ మురళీకర్ణం

ఖమ్మం సంక్షేమ విభాగం, జూలై 12: నేరాలకు పాల్పడే వారిలో సామాజిక, ఆర్థిక పరిస్థితులు కారణంగా ఉంటాయని గతంలో భారత న్యాయచట్టాలను రూపొందిస్తే ఇప్పుడు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పార్లమెంట్‌లో ప్రతిపక్ష పార్టీల సభ్యులను మాట్లాడే హక్కు లేకుండా సస్పెన్షన్‌కు గురి చేసి నూతన న్యాయ చట్టాలను అమలులోకి తీసుకొచ్చిందని నల్సార్ యూనివర్సిటి ప్రొఫెసర్ మురళీకర్ణం విమర్శించారు. శుక్రవారం రాత్రి సీపీఐ(ఎంఎల్)మాస్‌లైన్ ఆధ్వర్యంలో ఖమ్మంలోని ఐఎంఏ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన నూతన న్యాయ చట్టాల సెమినార్‌లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. నూతన న్యాయ చట్టాల ద్వారా పౌర సమాజిక చట్టాల హక్కులకు భంగం కలుగుతుందన్నారు. పరిపాలనలో తిరుగులేని శక్తిగా కఠినమైన నిర్ణయాలను ప్రశ్నించేవారిపై తీసుకునేందుకు నూతన చట్టాలు ఉపయోగపడ్తాయని ఆరోపించారు. ప్రజలకు జీవించే హక్కు, పౌరస్వేచ్ఛను కోల్పోతారని విమర్శించారు. రాజద్రోహం చట్టాన్ని సుప్రీంకోర్టు రద్దు చేస్తే దొడ్డిదారిన మరో రూపంలో తిరిగి తీసుకొచ్చారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సెమినార్‌లో సీనియర్ న్యాయవాది కొల్లి సత్యనారాయణ, వి. కృష్ణమూర్తి, కె. రవి, ఓరుగంటి శేషగిరి, సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి గోకినేపల్లి వెంకటేశ్వరరావు, ఆవుల అశోక్, పావెల్, శిరీషా, శిరోమణి, ఝాన్సీ, కొల్లేటి నాగేశ్వరరావు, మంగతాయి, శోభ పాల్గొన్నారు.

గిరిజనుల సమస్యలు

తీర్చడమే లక్ష్యం

- జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోతు హుస్సేన్



హుస్సేన్‌నాయక్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న ఎల్‌హెచ్‌పీఎస్ నాయకులు

ఖమ్మం, జూలై 12 (ఆంధ్రజ్యోతి): గిరిజన బిడ్డల సమస్యలు తెలుసుకుని తీర్చడమే ఎస్టీ కమిషన్ లక్ష్యమని జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోతు హుస్సేన్ అన్నారు. ఇప్పటివరకు చదువుకున్న వారికి కూడా ఎస్టీ కమిషన్ ఉందన్న విషయం తెలియడంలేదని, ఏ గిరిజన బిడ్డ అయినా లా అండ్ ఆర్డర్, గ్రామాల్లో, కలెక్టర్ దృష్టికి వెళ్లినా సమస్యలు పరిష్కారం అవ్వకపోతే నేరుగా ఎస్టీ కమిషన్‌కు ఫిర్యాదు చేయొచ్చన్నారు.

ఖమ్మం నగరంలోని ఎన్నెస్పీ గెస్ట్‌హౌస్‌లో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతాల్లోని గిరిజనులకు చెందాల్సిన ఇసుక, గనులను బినామీ పేర్లతో తవ్వుతూ దందాలు చేస్తున్నారన్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లోని గిరిజనులకు నేరుగా సంక్షేమ పథకాలు అందేలా చూడాలని రాష్ట్రపతిని కోరామన్నారు. గత ప్రభుత్వం గిరిజనులను ఆగం పట్టించిందన్నారు. పోడు పట్టాలిస్తామని ఇవ్వకుండా బేడీలు వేసిన సంఘటనలు చూశామన్నారు. ప్రస్తుత ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడు నెలల కాలం గడిచినప్పటికీ గిరిజనుల భూ సమస్యలు పరిష్కారం కాలేదన్నారు. గిరిజన పాఠశాలల్లో అడ్మిషన్ల కోసం టెస్టులు పెడుతున్నారని, ఆయా టెస్టులు రాయడమే తెలియని గిరిజన ప్రజల పరిస్థితేంటని ఆయన ప్రశ్నించారు. మెరిట్ ఉన్న విద్యార్థులకు మాత్రమే సీట్లు ఇస్తే.. వెనుకబడిన గిరిజన విద్యార్థులు ఎక్కడ చదువుకోవాలన్నారు. దానిని గాడిలో పెట్టాలన్నారు.

కొందరు కిందిస్థాయి అధికారులు చేసే తప్పులకు ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు కమిషన్ ఎదుట హాజరుకావాల్సిన పరిస్థితులు నెలకొంటున్నాయన్నారు. కమిషన్ దగ్గరకు వచ్చిన సమస్యలు 99శాతం పరిష్కారం అవుతాయన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెడుతున్న పథకాలు ప్రజల్లోకి వెళ్తున్నాయా? లేవా అన్న విషయాలు తెలుసుకునేందుకు అన్నీ రాష్ట్రాల్లో పర్యటిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఆసియా ఖండంలోనే అతిపెద్ద జాతరగా పేరొందిన సమ్మక్క, సారక్క జాతర గిరిజన సంప్రదాయాలతో కూడినదనీ, కానీ దానికి నిధులు మాత్రం చేరాల్సిన రీతిలో చేరలేదని, జాతరకు ఐటీడీఏల నుంచి నిధులు వెళ్లాల్సి ఉందన్నారు. నిధుల విడుదల, దుర్వినియోగంపై వచ్చిన ఫిర్యాదుపై రాష్ట్ర ప్రభుత్వాన్ని నివేదిక ఇవ్వాలని అడిగినట్టు తెలిపారు.

గిరిజనులు తమ సమస్యలను ఎన్ఎస్ఎస్‌టీ గ్రామ్ ద్వారా ఫిర్యాదు చేయొచ్చన్నారు. ఢిల్లీ వరకు రాలేనివారు సైతం హైదరాబాద్‌లోని ప్రాంతీయ కార్యాలయంలో తమ ఫిర్యాదులను అందించవచ్చన్నారు. ఈ సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ, ఉపాధ్యక్షురాలు మందా సరస్వతి, ప్రధాన కార్యదర్శి శ్యామ్ రాథోడ్, చావా కిరణ్, శ్యామ్, అనిత, శ్రీకాంత్, పలువురు అధికారులు నాయకులు పాల్గొన్నారు.

వైద్య ఆరోగ్యశాఖలో బదిలీల సందడి

ఖమ్మం కలెక్టరేట్, జూలై 12: జిల్లా వైద్య, ఆరోగ్యశాఖలో బదిలీల హడావుడి కొనసాగుతోంది. గత నాలుగు రోజులుగా అధికారులు ఆఫీసులో ఐదేళ్ల సీనియారిటీ ఉన్న డాక్టర్లు, ఇతర సిబ్బంది జాబితాను తయారు చేశారు. నాలుగేళ్లకు మించి ఒకే చోట పనిచేస్తున్న వాళ్లందరినీ ట్రాన్స్‌ఫర్ చేయాల్సిందేనని, ఎవరికీ మినహాయింపు ఇవ్వొద్దని ప్రభుత్వ ఆదేశాల నేపథ్యంలో బదిలీల ప్రక్రియ సీనియారిటీ జాబితాను పకడ్బందీగా చేపట్టారు. ఈ నెల 9నుంచి 12వరకు ఉద్యోగులు ఆప్షన్లు ఇచ్చే ప్రక్రియను చేపట్టారు. హాస్పిటళ్లు, పీహెచ్‌సీల్లో పనిచేస్తున్న డాక్టర్లు, నర్సింగ్ సిబ్బంది, ఇతర కేడర్ల సిబ్బందికి ఏళ్ల తరబడి బదిలీలు లేకపోవడంతో పాతుకుపోయారు. డాక్టర్లు, సిబ్బంది రేషనలైజేషన్ కోసం గత సర్కార్ ప్రయత్నం చేసినప్పటికీ వివిధ కారణాలతో అమలు చేయలేదు. తాజాగా కాంగ్రెస్ ప్రభుత్వం సర్కారు దవాఖాన్లను బలోపేతం చేయడానికి, ముఖ్యంగా జిల్లాలు. ట్రైబల్ ఏరియాల్లో ఉన్న హాస్పిటళ్లలోనూ డాక్టర్లు, సిబ్బంది అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకునేందుకు ప్రయత్నిస్తోంది. ఇందుకోసం ప్రమోషన్లను ఉపయోగించుకోవాలని, ఒకే చోట పాతుకుపోయిన వారిని బదిలీ చేయాలని యోచిస్తోంది.

జిల్లాలో వైద్య, ఆరోగ్యశాఖలో సివిల్ సర్జన్లు, డిప్యూటీ సివిల్ సర్జన్లు, మెడికల్ ఆఫీసర్లు, డీఎంవో, డెంటల్ సర్జన్స్ అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్లు, సీహెచ్‌వోలు, స్టాటిస్టికల్ ఆఫీసర్లు, ఎంపీహెచ్‌ఈవోలు, పీఎన్‌హెచ్ (ఎన్‌టీ), ఏపీఎంవో, పీఎంవో, ఆర్థోపెడిక్స్, హెల్త్ ఎడ్యుకేటర్స్, డెమోలు, డిప్యూటీ డెమోలు, ఫార్మాసిస్టులు, హెడ్‌నర్సులు, ల్యాబ్ టెక్నీషియన్లు, సీనియర్ అసిస్టెంట్లు, జూనియర్ అసిస్టెంట్లు ఇలా మొత్తం 46విభాగాల్లో 655మంది రెగ్యులర్ ఉద్యోగులు ఉండగా 223మంది కాంట్రాక్టు పద్ధతిన ఉద్యోగులు పనిచేస్తున్నారు. మొత్తం 878 పోస్టులు ఉండగా 504 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. దాదాపు ఈ బదిలీల ప్రక్రియలో 40 శాతం జరుగుతుండగా జిల్లాలో 4ఏళ్ల దాటిన వారికి బదిలీలు తప్పవని ప్రచారం జరుగుతోంది.

వైద్య విధాన పరిషత్‌లో 1180 మంది..

వీవీపీ మొత్తం 1180మందికి బదిలీలు జరగనున్నాయి. జోన్ పరిధిలో ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, వరంగల్, మహబూబాబాద్ జిల్లాల పరిధిలో బదిలీలు కొనసాగనున్నాయి. వైద్య విధాన పరిషత్‌లోనూ ఖమ్మం జిల్లాలో మినిస్టీరియల్, సిబ్బంది 60, పార్మాడికల్ 125, నర్సింగ్ సిబ్బంది 546, మెడికల్ సిబ్బంది 449మంది ఉన్నారు. మొత్తంగా 1180 మంది సిబ్బందికి ఈ బదిలీల్లో జోనల్‌స్థాయిలో పోస్టింగులు కేటాయించనున్నట్టు తెలుస్తోంది. గత ఐదు రోజులుగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ పరిధిలో ఈ బదిలీల ప్రక్రియ చర్చనీయాంశంగా మారుతోంది.

గిరిజనుల కేసులపై వెంటనే స్పందించాలి

(3వ పేజీ తరువాయి)

వివరాలు సమర్పించాలన్నారు. సింగరేణి, ఏన్కూరు మండలాల్లో మిషన్ భగీరథ పనులు చేపట్టిన వారికి బిల్లులు రాలేదని, వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. గిరిజన భవన్ నిర్వహణ చేపట్టి, వాడుకలో తేవాలన్నారు. తండాలు, గ్రామ పంచాయతీలుగా మారిన చోట, భవనాలు నిర్మించాలని, ఉపాధిహామీ సిబ్బంది నియామకానికి చర్యలు చేపట్టాలన్నారు. సమీక్షలో జిల్లా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ మాట్లాడుతూ, వివిధ శాఖల ద్వారా గిరిజన సంక్షేమానికి కేంద్ర, రాష్ట్ర పథకాల అమలు జరుగుతుందన్నారు. ఆర్వోఎఫ్ఆర్ కింద 2022లో కొత్త దరఖాస్తులు స్వీకరించి 6,589 మందికి 13వేల ఎకరాల భూమికి పట్టాలు ఇచ్చినట్లు తెలిపారు.

ఎకో టూరిజంలో గిరిజనులకే ఉపాధి కల్పిస్తున్నట్లు, గిరివికాసం కింద 318 బోర్లు, అవసరమైన చోట్ల విద్యుత్ లైన్లు మంజూరు చేశామన్నారు. జిల్లాలో 4,800మంది ఎస్టీ లకు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పౌష్టికాహారం అందిస్తున్నామన్నారు. 24,647 మంది గిరిజనులకు ప్రతినెలా రూ.6.85 కోట్ల చేయూత పెన్షన్లు అందిస్తున్నామన్నారు. 18,202 మంది గిరిజనులకు వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణానికి రూ.21.86 కోట్లు ఇచ్చామన్నారు. ఉపాధి హామీ కింద గత సంవత్సరం రూ. 26.57 కోట్లు వేజ్ పేమెంట్ కింద అందజేశామన్నారు. జిల్లాలో 1,216 పాఠశాలల్లో 60,380 మంది విద్యార్థులు ఉండగా, ఇందులో 19,181 మంది గిరిజన విద్యార్థులు ఉన్నారని, 4,346 మంది ఉపాధ్యాయులు ఉండగా, 669 గిరిజన ఉపాధ్యాయులు ఉన్నట్టు తెలిపారు. పిల్లలకు యూనిఫామ్, పాఠ్యపుస్తకాలు, బోధన ఉచితంగా అందిస్తున్నామన్నారు. అన్ని పాఠశాలల్లో ఆంగ్ల మాధ్యమం ద్వారా బోధన జరుగుతున్నట్లు ఆయన తెలిపారు.

జిల్లాలో 59,500మంది గిరిజన రైతులు ఉన్నట్లు, వారందరికీ పథకాల లబ్ధి అందిస్తున్నట్టు ఆయన అన్నారు. పోలీస్‌శాఖ ద్వారా 11 ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు కాగా, 6కేసుల్లో విచారణ పూర్తి చేసినట్లు, మిగిలినవి విచారణలో ఉన్నట్లు తెలిపారు. 2020 నుంచి ఇప్పటివరకు 121 కేసుల్లో పరిహారం అందించినట్లు కలెక్టర్ అన్నారు. గిరిజనుల సంక్షేమం, అభివృద్ధికి వేగంగా పథకాలు అమలుచేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఈ సందర్భంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వినతులు స్వీకరించి సంబంధిత అధికారులకు పరిష్కార చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అటవీ అధికారి సిద్దార్థ్ విక్రమ్ సింగ్, అదనపు కలెక్టర్ డి.మధుసూదన్ నాయక్, అదనపు డీసీపీ నరేశ్ కుమార్, డీఆర్వో ఎం.రాజేశ్వరి, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి విజయలక్ష్మి, జిల్లా అధికారులు, గిరిజన సంఘాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

డ్రోన్‌సేవలను రైతులు వినియోగించుకోవాలి



డ్రోన్‌ను ప్రారంభిస్తున్న ఏడీఏ తాతారావు

అశ్వాపురం, జూలై 12: పురుగుల మందు పిచికారీకి సులభతరంగా రైతులు డ్రోన్ సేవలను వినియోగించుకోవాలని మణుగూరు ఏడీఏ తాతారావు కోరారు. ఇఫ్కో సంస్థ ఆధ్వర్యంలో ఆవిష్కరించిన డ్రోన్‌ను శుక్రవారం మండల పరిధిలోని గోపాలపురం గ్రామంలో రైతులసమక్షంలో ప్రారంభించారు. కూలీలకొరత, ఆర్థిక భారం ఉన్న తరుణంలో డ్రోన్ సేవలను వినియోగించుకోవాలన్నారు. డ్రోన్ సమయంతో పత్తి, మిరప, చెరుకు, పామాయిల్ తోటలతోపాటు వరిలోకూడా పురుగుల మందును పిచికారి చేసుకోవచ్చునన్నారు. ఏజెన్సీ రైతులకు డ్రోన్ సేవలను అందుబాటులోకి తెచ్చిన అశ్వాపురం శ్రీనివాస ఆగ్రోఏజెన్సీ వారిని ఈందర్భంగా అభినందించారు. కార్యక్రమంలో ఇఫ్కో సంస్థ జిల్లా సేల్స్ మేనేజరు నాగార్జున, మండల ఏవో సాయిశంతన్‌కుమార్, శ్రీనివాస ఆగ్రోఏజెన్సీస్ ఛైర్మన్ భిక్షమయ్య తదితరులు పాల్గొన్నారు.

రేమిడిచర్లలో డ్రోన యంత్రాల పరీక్షా కేంద్రం

- స్థలాన్ని పరిశీలించిన కేంద్ర అధికారులు
- అనుకూలతలను వివరించిన కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్



స్థలాన్ని పరిశీలిస్తున్న కేంద్ర ప్రభుత్వ అధికారులు

ఎర్రుపాలెం, జూలై 12: మధిర నియోజకవర్గంలోని ఎర్రుపాలెం మండలానికి మహర్దశ రాబోతోంది. మండలంలోని రేమిడిచర్ల గ్రామంలో పారిశ్రామిక వాడకు కేటాయించిన 53.18 ఎకరాల భూమిని శుక్రవారం కేంద్ర ప్రభుత్వ అధికారులు పరిశీలించారు. డ్రోన్ యంత్రాలను పరీక్షించేందుకు ఇక్కడ యూనిట్‌ను ఏర్పాటు చేయనున్నారు. ఆసియాలోనే ఈ తరహా యూనిట్ మొదటిదని చెబుతున్నారు. పరీక్షా కేంద్రం ఏర్పాటుకు రేమిడిచర్లలో అనుకూల వాతావరణం ఉందని, పరీక్షా కేంద్రానికి స్థలం సరిపోతుందో లేదో ప్రతిపాదనలు సిద్ధం చేయాల్సి ఉందని అధికారులు తెలిపారు. డ్రోన్ టెక్నాలజీతో వివిధ యంత్రాలను తయారుచేసిన అనంతరం పరీక్ష కోసం ఇక్కడికి పంపిస్తారని తెలిసింది.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ జమలాపురం గ్రామంలోని వాసిరెడ్డి కల్యాణ మండపంలో కేంద్ర ప్రభుత్వ అధికారులతో సమావేశమయ్యారు. ఎర్రుపాలెం మండలంలో జాతీయ రహదారి ఏర్పాటు కానుందని, ఏపీ రాష్ట్రానికి, రాజధానికి ఈ ప్రాంతం దగ్గరగా ఉందని కలెక్టర్ తెలిపారు. రైల్వే జోన్ ప్రతిపాదన కూడా ఉందని ఈ ప్రాంతం అన్ని విధాల డ్రోన్ పరీక్షా కేంద్రానికి అనుకూలంగా ఉంటుందన్నారు. ప్రభుత్వం నుంచి అన్ని విధాల సహకారం ఉంటుందని, పరీక్ష కేంద్రం ఏర్పాటుకు కృషి చేయాలని కేంద్ర ప్రభుత్వ ప్రతినిధులను కలెక్టర్ కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో గణేష్, తహసీల్దార్ ఎం.ఉషాశారద, ఆర్ఐలు రవికుమార్, రాజశేఖర్ పాల్గొన్నారు.



45 ప్రభుత్వ పాఠశాలల్లో...

జీరో అడ్మిషన్లు..

▸▸ లోపించించిన ముందస్తు ప్రణాళిక ▸▸ నామమాత్రంగానే బడిబాట కార్యక్రమాల నిర్వహణ

ఖమ్మం ఖానాపురం హవేలి, జూలై 12: ఖమ్మం జిల్లాలో 45 ప్రభుత్వ పాఠశాలల్లో 2024-25 విద్యాసంవత్సరంలో జీరో అడ్మిషన్లు నమోదైనట్లు జిల్లా విద్యాశాఖ అధికారులు తెలిపారు. గత ఏడాది మొత్తం 53 ప్రభుత్వ పాఠశాలల్లో జీరో అడ్మిషన్లు ఉండగా, ఈ ఏడాది 8 పాఠశాలల్లో కొన్ని అడ్మిషన్లు రాగా, మిగిలిన 45 పాఠశాలల్లో ఒక్క అడ్మిషన్ కూడా రాలేదు. దీంతో జిల్లా విద్యాశాఖ అధికారులు ప్రతి ఏటా నిర్వహించే బడిబాట కార్యాక్రమాల నిర్వహణ ఎలా ఉందో చెప్పవచ్చు. బడిబాట నిర్వాహణకు ముందస్తు ప్రణాళికలు లేకపోవడం, నామమాత్రంగానే బడిబాట నిర్వహించారనే విమర్శలు వినపడుతున్నాయి.

కాని ఆయా గ్రామాల్లోని పలువురు విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలు అందుబాటులో ఉన్నా, ప్రయివేటు పాఠశాలలకి వెళ్లటానికే మొగ్గు చూపుతున్నట్లు తెలుస్తోంది. దీంతోనే ప్రభు త్వ పాఠశాలలు విద్యార్థులు లేక మూతపడుతున్నట్లు తెలుస్తోంది. బడిబాట కార్యక్రమంలోనైనా గ్రామాల్లోని విద్యార్థుల్లో కనీసం ముగ్గురు, నలుగురినైనా చేర్పించలేని విద్యాశాఖ బడిబాట కార్యక్రమం ఎందుకు నిర్వహిస్తున్నారో, ఆ శాఖ అధికారులకే తెలియాలి. ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్లు పెంచేందుకు జిల్లాలో బడిబాట అంటూ విద్యాశాఖ అధికారులు హడావుడి చేస్తున్నా, క్షేత్రస్థాయిలో దానికి స్పందన నామమాత్రంగా ఉంద న్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

జిల్లా కేంద్రంతో పాటు పలు నియోజకవర్గ కేంద్రాల్లో ప్రైవేటు స్కూళ్లలో నోఅడ్మిషన్ల బోర్డులు దర్శనమిస్తున్నాయి. ప్రైవేటు విద్యాసంస్థలతో పోలిస్తే ప్రభుత్వ బడుల పరిస్థితి అడ్మిషన్ల విషయంలో చాలా వెనుకబడి ఉన్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. కేవలం ప్రచార ఆర్భాటం తప్ప, పిల్లలను బ డులకు తీసుకెళ్లాలనే తపన చాలామంది ఉపాధ్యాయుల్లో కనిపించడం లేదని ప్రజలు విమర్శిస్తున్నారు. ఒకరిద్దరు టీచర్లు, నలుగురైదుగురు విద్యార్థులను వెంటబెట్టుకొని నామమాత్రంగా నిర్వహించి, బడిబాట కార్యక్రమం చేపట్టామంటూ నివేదికలు పంపుతున్నారనే విమర్శలున్నాయి. ఇక పల్లెల్లో ర్యాలీలు, ప్రచారాలు ఏమాత్రం కనిపించలేదు. మూతపడుతున్న ప్రభుత్వ పాఠశాలల సంఖ్య నానాటికీ పెరిగిపోతున్నప్పటికీ విద్యాశాఖ అధికారులు నిర్వహిస్తున్న బడిబాట విషయంలో ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలు 1,280 ఉండగా ప్రైవేటు పాఠశాలలు 250పైగా ఉన్నాయి. ప్రభుత్వ పాఠశాలల్లో 1నుంచి 10వతరగతి చదివే విద్యార్థులు 1,30,000 మంది ఉండగా, ప్రైవేటు పాఠశాలల్లో చదివే విద్యార్థులు 2లక్షలకు పైగానే ఉన్నారు. ప్రభుత్వ స్కూళ్లు అధికంగా ఉన్నా, విద్యార్థుల సంఖ్య మాత్రం ప్రైవేటు సగానికి తక్కువగానే హాజరుశాతం ఉండడం, విద్యాశాఖ నిర్లక్ష్యానికి నిదర్శనంగా ఉంది.

ప్రతిఏటా నిర్వహించే బడిబాటలో విద్యార్థులను గుర్తించడం తప్ప, వారిని బడుల్లో చేర్పేలా చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం తెలుగు మీడియంతో పాటు ఇంగ్లిష్ మీడియం అందుబాటులో తెచ్చినా, విద్యార్థుల హాజరుశాతం మా త్రం అంతంతమాత్రంగానే ఉంది. విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు ప్రభుత్వ పాఠశాలాల్లో చదివితే వచ్చే ప్రయోజనాలు గురించి వివరించలేకపోతున్నారు. ఇకనైనా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచేందుకు అధికారులు కృషి చేయాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

బడిబాట కార్యాక్రమంలో భాగంగా ఉపాధ్యాయులు గ్రామాలకు వెళ్లి ఇంటింటి ప్రచారం, కరపత్రాల పంపిణీ, బ్యానర్లతో ర్యాలీలు, ప్రచారం నిర్వహించినా విద్యార్థులకు వారి తల్లితండ్రులకు సరైన అవగాహన నిర్వహించకపోవడంతోనే ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు చేరడం లేదనే వాదనలు వినపడుతున్నాయి. జూన్ నెలంతా బడి బయటి పిల్లలను బడిలో చేర్చుకునేందుకు, చదువులో వెనుకబడిన విద్యార్థులకు సంసిద్ధతా కార్యక్రమాలు నిర్వహించిన, ఉపాధ్యాయులు జూలై నుంచి బోధన మొదలు పెట్టాల్సి ఉంది, కానీ ఈ విద్యా సంవత్సరం ఆదిలోనే హంసపాదు ఎదురైనట్లు ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ ప్రారంభం కావడంతో ఉపాధ్యాయులు పాఠాలు చెప్పేందుకు తీరికదొరకడంలేదనే వాదనలు వినబడుతున్నాయి.

ఖమ్మం జిల్లాలో

- ☛ 1 నుంచి 10 మంది విద్యార్థులు ఉన్న ప్రభుత్వ పాఠశాలలు 134.
- ☛ 11 నుంచి 40 మంది విద్యార్థులు ఉన్న పాఠశాలలు 544.
- ☛ 41 నుంచి 60 మంది విద్యార్థులు ఉన్న పాఠశాలలు 168 ఉన్నాయి.
- ☛ జీరో అడ్మిషన్ల పాఠశాలలు 45 ఉన్నాయి.

జిల్లాలో జీరో అడ్మిషన్లు గల పాఠశాలలు..

ఏన్కూర్‌లో ఒకటి, కల్లూరులో 7, కామేపల్లిలో 5, ఖమ్మం రూరల్‌లో ఒకటి, మధిరలో 4, ముదిగొండలో 2, నేలకొండపల్లిలో 2, పెనుబల్లిలో 6, రఘునాథపాలెంలో ఒకటి, సత్తుపల్లి 2, సింగరేణిలో 2, తల్లాడలో 6, తిరుమలాయపాలెంలో 3, వేంసూర్‌లో ఒకటి, వైరాలో ఒకటి, ఎర్రుపాలెంలో 2 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి.

లక్ష్య సాధన కోసం కృషి చేయాలి

▸▸ జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోతు హుస్సేన్ నాయక్



విద్యార్థులతో మాట్లాడుతున్న జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు హుస్సేన్

ఖమ్మం రూరల్, జూలై 12: విద్యార్థులు లక్ష్య సాధన కోసం కృషి చేయాలని జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోతు హుస్సేన్ నాయక్ అన్నారు. శుక్రవారం మండలంలోని గొల్లగూడెంలోని గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు భవిష్యత్‌లో లక్ష్యం సాధించాలంటే పాఠశాల నుంచే కష్టపడి చదువుకోవాలన్నారు. పాఠశాలలో కరాటే నేర్చుకుంటున్న విద్యార్థులతో కరాటే గురించి ముచ్చటించారు. అనంతరం పాఠశాలలో వసతులు విద్యార్థులకు ఇస్తున్న సదుపాయాల గురించి అడిగి తెలుసుకున్నారు. డార్మేటరీ గదుల అవసరం ఉందని, వంటగది పరిశుభ్రత, గదుల శుభ్రత పనిచేయని ఆర్వో ప్లాంట్, డైనింగ్ రూమ్, కుర్చీలు లేకపోవడాన్ని హెచ్‌డబ్ల్యూవో రమాకుమారిని అడిగి తెలుసుకున్నారు. వసతి గృహానికి ఏది తక్కువైనా వెంటనే పై అధికారులకు తెలపాలని సూచించారు. అనంతరం ట్రైకార్ అధికారి శంకర్‌రావును బడ్జెట్ కేటాయింపు గురించి తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాది కరాటే మాస్టర్ జి.రాము, ఇన్‌స్పెక్టర్లు జె.హరీష్, ఉదయ్ తివారి, భాస్కర్, ఎస్టీ కమిషన్ మెంబర్లు తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న వైజ్ఞానిక ప్రదర్శన



ఫ్యూచరిస్టిక్ ల్యాబ్ ఆన్ వీల్ వాహనంలో పరికరాలు

భద్రాచలం, జూలై 12: భద్రాచల పట్టణంలో ఫ్యూచరిస్టిక్ ల్యాబ్ ఆన్ వీల్ (ఫ్లో) వచ్చింది. శుక్రవారం ఈ బస్‌లో వైజ్ఞానిక ప్రదర్శనను సరస్వతి శిశుమందిర్ విద్యార్థులతో పాటు ఇతర పాఠశాలల విద్యార్థులు తిలకించారు. ఈ సందర్భంగా సీటీవో పవన్‌కుమార్, సీవో చేత్రాశ్రీ, ఇతర సభ్యులు చిన్నారులకు భవిష్యత్‌లో దేశంలో సాంకేతిక అభివృద్ధిలో చోటు చేసుకోనున్న మార్పుల గురించి వివరించారు. వెదర్ స్టేషన్, రోబోటిక్స్ జోన్, ఐవోటీ జోన్, ఏఆర్ జోన్, ప్రోగ్రామింగ్ జోన్, టెక్ టూల్స్ జోన్, త్రీడీ ప్రింటింగ్ జోన్, హోలోగ్రామ్స్, కంప్యూటర్ టెక్నాలజీకి తదితర వాటి గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ ఏటీడీవో నరసింహారావు, ఏఎంవో రమణయ్య, సరస్వతి శిశుమందిర్ అధ్యక్షుడు పాకాల దుర్గాప్రసాద్‌లు మాట్లాడుతూ గిరిజన ప్రాంతాల నుంచి వచ్చిన విద్యార్థులు ఈ టెక్నాలజీ ప్రాధాన్యతను తెలిపేందుకు ముందుకు వచ్చి ఈర్లపాటి కృషి అభినందనీయమన్నారు. మధులాష్‌బాబు బృందానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కార్యదర్శి గట్టు వెంకటాచార్య కోశాధికారి కుంచాల రాజారాం, ఆవుల సుబ్బారావు, కడాలి నాగరాజు, ప్రధానోపాధ్యాయురాలు గీత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కవి ఆశారాజుకు నేడు సాహిత్య పురస్కారం అందజేత

ఖమ్మంసాంస్కృతికం, జూలై 12: ప్రముఖ కవి ఆశారాజుకు శనివారం ఖమ్మంలో హాసిని రామచంద్ర లిటరరీ ఫౌండేషన్ (హెచ్ఆర్‌సీ) 2024 సాహిత్య పురస్కారాన్ని అందజేయనున్నారు. ఎన్నెస్పీ క్యాంపు రామాలయం ప్రాంతంలో గల డీపీఆర్‌సీ భవనంలో జరిగే సాహిత్య సభలో ఆశారాజుకు సాహిత్య పురస్కారంతో పాటు ఇటీవల హెచ్ఆర్‌సీ ఆధ్వర్యంలో నిర్వహించిన కవిత్వ, కథల పోటీల విజేతలకు బహుమతులు అందజేయనున్నారు. కార్యక్రమంలో పలువురు సాహిత్యవేత్తలు పాల్గొననున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

వైరా అభివృద్ధికి నిధులివ్వండి

▸▸ ముఖ్యమంత్రి, మంత్రులకు వైరా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ వినతి



సీఎం రేవంత్‌రెడ్డితో మంత్రులు, ఎమ్మెల్యేలు

వైరా, జూలై 12: అన్నిరంగాల్లో వెనుకబడి ఉన్న వైరా నియోజకవర్గ అభివృద్ధికి నిధులివ్వాలని సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులను వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ కోరారు. శుక్రవారం హైదరాబాద్‌లో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురామిరెడ్డి, జిల్లాకు చెందిన మరో ముగ్గురు ఎమ్మెల్యేలతో కలిసి సీఎం రేవంత్‌రెడ్డిని రాందాస్ కలిశారు. అలాగే నీటిపారుదలశాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఐటీశాఖ మంత్రి డి.శ్రీధర్‌బాబును కూడా ఎమ్మెల్యే కలిసి నియోజకవర్గ సమస్యలను ప్రస్తావించి, తోడ్పాటునివ్వాలని విజ్ఞప్తి చేశారు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, వైరా, కొణిజర్ల మండల కాంగ్రెస్ అధ్యక్షులు శీలం వెంకటనర్సిరెడ్డి, వడ్డే నారాయణరావు, చెన్నారావు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రిని కలిసిన మువ్వా విజయబాబు

సత్తుపల్లి: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని రాష్ట్ర ఇరిగేషన్ కార్పొరేషన్ ఛైర్మన్ మువ్వా విజయబాబు శుక్రవారం హైదరాబాద్‌లో కలిశారు. ఇటీవల కార్పొరేషన్ ఛైర్మన్‌గా తనను నియమించినందుకు సీఎంకు మువ్వా కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఎంపీ రామసహాయం రఘురామిరెడ్డి, ఎమ్మెల్యేలు ఉన్నారు.

'ముదిరాజ్‌లను బీసీ-ఏలోకి మార్చాలి'

ఖమ్మంచర్చికాంపౌండ్, జూలై12: ముదిరాజ్ బీసీ-డీ నుంచి బీసీ-ఏ లోకి మార్చాలని తెలంగాణ ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లబోయిన అశోక్ ముదిరాజ్ పేర్కొన్నారు. శుక్రవారం ఖమ్మం ముస్తాఫానగర్‌లో సంఘం కార్యాలయంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ బండ ప్రకాష్ ముదిరాజ్ ఆదేశాల మేరకు జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ముదిరాజ్‌లకు రూ.వెయ్యికోట్ల బడ్జెట్‌ను కేటాయించాలని, ముదిరాజ్ ఫైనాన్స్ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని కోరారు. ముదిరాజ్‌లకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతూ పోస్టర్‌ను ఆవిష్కరించారు ఈసమావేశంలో సంఘం రాష్ట్ర ఎస్ఆర్ఐ కన్వీనర్ చానబోయిన రాజ్‌కుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు పిట్ట ల వెంకటనర్సయ్య, జిల్లా అధ్యక్షుడు రావుల హనుమంతరావు, మామిడి వెంకటేశ్వర్లు, జిల్లా ప్రధాన కార్యదర్శి గాదె రాంబాబు, కార్యదర్శి నర్ల శేషయ్య, లింగనబోయిన లక్ష్మణ్, ప్రతానపు రామనాథం, అక్కి కోటయ్య, పగడాల మల్లేష్, కాలంగి మోహన్‌రావు, చిలుకూరి కృష్ణ, ఆకటి రమేస్ తదితరులున్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు



రాష్ట్ర మత్స్య సహకార సంఘం ఛైర్మన్ సాయికుమార్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న రఘు, నాయకులు

మత్స్య సహకార అభివృద్ధికి చేయూత నివ్వాలి

కల్లూరు: మత్స్యసహకార సంక్షేమ అభివృద్ధికి చేయూత నివ్వాలని కల్లూరు ఎంపీపీ బీరవల్లి రఘుతో పాటుగా పలువురు ప్రజా ప్రతినిధులు ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్ర మత్స్య సహకారం సంఘ ఛైర్మన్‌గా ఎం. సాయికుమార్ ఎంపికైన సందర్భంగా రఘుతో పాటుగా వరంగల్ జిల్లా పరిషత్ వైస్ ఛైర్మన్ ఆకుల శ్రీనివాస్, జమ్మికుంట కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత ప్రభాకర్‌లు హైదరాబాద్‌లో శుక్రవారం కలిసి అభినందించారు. స్పందించిన ఛైర్మన్ సాయికుమార్ మాట్లాడు తూ మత్స్య సహకారం సంక్షేమ అభివృద్ధిపై సీఎం రేవంత్‌రెడ్డి దృ ష్టికి తీసుకోవెళ్లి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారని రఘు తెలిపారు.

అనారోగ్యంతో కబడ్డీ మాజీ క్రీడాకారుడి మృతి



నాగేశ్వరరావు

అశ్వాపురం, జూలై 12: అనారోగ్యంతో మాజీ రాష్ట్ర స్థాయి కబడ్డీ క్రీడాకారుడు మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని గొంది గూడెం గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన వర్సా నాగేశ్వరరావు (66) కొంతకాలంగా కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నాడు. చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. నాగేశ్వరరావు 1985 ప్రాంతంలోనే రాష్ట్ర స్థాయి కబడ్డీ జట్టులో స్థానం సంపాదించి, జాతీయ స్థాయి పోటీలలో పాల్గొన్నారు. 1995లో భద్రాచలం ఐటీడీఏలో ఉద్యోగం చేస్తూ, ఐటీడీఏ తరుపున పలు రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొన్నారు. మృతుడికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. మృతదేహన్ని ఎంపీపీ ముత్తినేని సుజాత సందర్శించి నివాళులర్పించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి ...

చింతకాని, జులై 12: మండల పరిధిలోని తిమ్మినేనిపాలెం గ్రామానికి చెందిన చీర్ల వెంకటేశ్వర్లు (48) అనే వ్యక్తి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వెంకటేశ్వర్లు ఖమ్మం నగరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో వాచ్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. ప్రతిరోజు ఖమ్మం నగరానికి ద్విచక్ర వాహనంపై వెళ్లి గ్రామానికి వస్తుంటాడు. ఈ క్రమంలో గత నెల 28వ తేదీ రాత్రి ద్విచక్ర వాహనంపై ఇంటికి వస్తుండగా గ్రామ సమీపంలో వాహనం అదుపుతప్పి కిందపడడంతో తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం అతడిని ఖమ్మంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. మృతుడి భార్య అనసూర్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ నాగుల్‌మీరా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఫ్యాన్ రెక్క తగిలి ఒకరు..



లచ్చిరాం(ఫైల్)

కారేపల్లి, జూలై12: ప్రమాదశాత్తూ ఫ్యాన్ రెక్క తగిలి వ్యక్తి మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని సూర్యతండాలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని సూర్యతండాకు చెందిన జర్పల లచ్చిరాం(55) తన పూరి గుడిసెలో ఉన్న ఫ్యాన్ రెక్కలు తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు భార్య ఈరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కరెంట్ సామగ్రి చోరీ

వైరా, జూలై 12: వైరాలో గ్రీన్‌ఫీల్డ్ హైవే విద్యుత్ కాంట్రాక్టర్‌కు చెందిన దాదాపు రూ.మూడులక్షల విలువైన సామగ్రి చోరీకి గురైంది. వివరాల ప్రకారం.. వైరా వ్యవసాయ మార్కెట్‌కు ఎదురుగా ఓ రేకుల షెడ్ గోదాములో గ్రీన్‌ఫీల్డ్ హైవేకు చెందిన విద్యుత్ కాంట్రాక్టర్ నిల్వ చేసిన కండక్టర్ వైర్‌ను, ఇతర సామగ్రిని గురువారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు అపహరించుకుపోయారు. ఈ సామగ్రిని తరలించుకుపోతున్న ఒక ఆటో సీసీ కెమెరాల్లో స్పష్టంగా రికార్డు అయి ఉంది. వైరాలోని ఓ ప్రాంతానికి చెందిన పాత ఇనుప సామాను దొంగలు ఈ చోరీకి పాల్పడినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. బాధితులు గోపీనాథ్‌రెడ్డి, వీరబాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా గురుపౌర్ణమి వేడుకలు

ఖమ్మంసాంస్కృతికం, జూలై 12: నగరంలోని సాయిబాబా దేవాలయాల్లో గురుపౌర్ణమి వేడుకలు అత్యంత ఘనంగా కొనసాగుతున్నాయి.. రెండోవ రోజు కార్యక్రమాల్లో భాగంగా సాయిబాబాకు పలు పూజా కైంకర్యాలు నిర్వహించారు.. రంగనాయకుల గుట్ట సాయిబాబాదేవాలయంలో ప్రజలకు బలము, ఆరోగ్యం, యశస్సు కోరుతూ సాయిబాబాకు ఆవుపెరుగుతో అభిషేకం చేశారు. లక్ష్మీహయగ్రీవ హోమం జరిపారు. లలితా పారాయణం, కుంకుమ పూజ నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు లగడపాటిరామారావు, సిద్దంశెట్టి నాగమణి తదిరులుపాల్గొన్నారు. గాంధీచౌక్‌లోని వరప్రధాత షిర్డీసాయిబాబా దేవాలయంలో స్వామి వారికి తేనె, నెయ్యితో అభిషేక కార్యక్రమాన్ని నిర్వహించారు. సత్యసాయి భజన మండలి సభ్యులు నగర సంకీర్తన చేసి సాయిబాబా మంత్రాన్ని ఆలపించారు. అనంతరం అష్టలక్ష్మిహోమం, తదితర పూజలు నిర్వహించారు. భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు మేళ్ల చెరువు వెంకటేశ్వర రావు, అర్వపల్లి నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.



పూజలు చేస్తున్న భక్తులు

రూ.6.6లక్షలు పలికిన సారపాక సంత వేలం



ఆందోళన చేస్తున్న స్థానికులు

బూర్గంపాడు, జూలై 12: మండల పరిధిలోని సారపాక గ్రామపంచాయతీ కార్యాలయంలో శుక్రవారం పంచాయతీ పరిధిలో నిర్వహించే వారపు సంత వేలాన్ని నిర్వహించారు. డీఎల్‌పీవో సుధీర్ కుమార్ అధ్యక్షతన నిర్వహించిన వేలంలో సారపాకకు చెందిన సురేష్ అనే వ్యక్తి రూ.6.60లక్షలకు పాటను దక్కించుకున్నాడు. పంచాయతీ ఆవరణలో నిర్వహించిన వారపుసంత వేల రసభసగా కొనసాగింది. వారపుసంత నిర్వహణతో రాకపోకలకు ఇబ్బంది పడాల్సిన పరిస్తితి ఉందని.. ప్రస్తుతం నిర్వహించే స్థలంలో కాకుండా మరో చోట ఏర్పాటు చేయాలని పలువురు ఆందోళన చేపట్టారు. ఇదిలా ఉండగా మరి కొందరు వారపుసంత లేకుంటే సామాన్యులు ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని, ప్రస్తుతం ఉన్న దగ్గరే సంతను నిర్వహించాలని కోరారు. దీంతో వారపుసంత రసభసగా మారింది. మూడు నెలల వ్యవధిలో ఇబ్బందులు లేకుండా ఉండే విధంగా వారపుసంతను ఏర్పాటు చేస్తామని అధికారులు తీర్మానించడంతో వారపు సంత వేలాన్ని కొనసాగించారు. కార్యక్రమంలో ఎంపీవో సునీల్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి మహేష్, పలు పార్టీల నాయకులు పాల్గొన్నారు.

బస్తర్ అడవుల్లో ఆపరేషన్ 'జలశక్తి'

▸▸ జెర్కిన్‌లు వేసుకుని, తుపాకులు పట్టుకుని..జోరువానలో కేంద్ర బలగాల కూబింగ్

చర్ల, జూలై 12: గత ఏడాది వరకు బస్తర్ అడవుల్లో కాలు పెట్టడానికే వణికి పోయిన బలగాలు నేడు దండకారణ్యంలోని చొచ్చుకుని పోతున్నాయి. నాడు గ్రామ సరిహద్దులకే పరిమితమైన కూబింగ్‌లు, నేడు మావోయిస్టుల కంచుకోటైన అబూజ్‌మడ్ అడవుల్లోనూ జోరుగా సాగుతోంది. రెండు సంవత్సరాల్లో మావోయిస్టులను లేకుండా చేస్తామన్న కేంద్ర మంత్రి అమిత్‌షా చెప్పిన విధంగా కేంద్ర బలగాలు అన్నల అన్వేషణలో ముందుకు సాగుతున్నారు. వేసవిలో ఆపరేషన్ సూర్యశక్తి కొనసాగించి మావోయిస్టులను దెబ్బతీసిని బలగాలు, నేడు ఆపరేషన్ జలశక్తిని పేరుతో కూబింగ్‌లు చేస్తున్నారు. దండకారణ్యంలో వర్షాలు కురుస్తున్నా బస్తర్ డివిజన్‌లోని ఏడు జిల్లాల అడవుల్లో డీఆర్‌జీ, బస్తర్ ఫైటర్స్, కోబ్రా, ఎస్టీఎఫ్, మహిళా కమాండోస్ బలగాలు కూబింగ్ చేస్తున్నాయి. ముఖ్యంగా నారాయణపూర్, కాంకేర్, సుకుమా, బీజాపూర్ అడవుల్లో గాలింపుని ముమ్మరం చేశాయి. మావోయిస్టులకు పట్టున్న ప్రాం తాలు, సంచరించే అడవులు, ఎతైన గుట్టల్లో ఈ గాలింపు సాగుతోంది. ప్రతీ రోజు వందల మంది బలగాలు వర్షాలు కురుస్తున్నా జెర్కిన్‌లు వేసుకుని, తుపాకులు పట్టుకుని అన్వేషణ సాగిస్తున్నారు. వాగులు, వంకలు దాటుకుంటూ ముందుకు సాగుతున్నారు. తాగేందుకు నీరు దొరకక పోయినా వర్షపు నీటిని పట్టుకుంటున్నారు. లోతైన వాగులను అంచనా వేస్తూ, పై నుంచి డ్రోన్‌లతో పహారా కాస్తూ ముందుకు సాగుతున్నారు. వర్షాకాలంలోనూ దండకారణ్యంలో యుద్ధ వాతావరణం కనిపిస్తోంది.



బస్తర్ అడవుల్లో కూబింగ్‌కు వెళ్తున్న బలగాలు

బడికి వెళ్లమన్నందుకు బాలిక బలవన్మరణం

సుజాతనగర్, జూలై 12: బడికి వెళ్లమన్నందుకు బాలిక బలవన్మరణం చెందిన ఘటన గరీబ్‌పేట గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. గరీబ్‌పేటలో నివాసముంటున్న బుర్ర కృష్ణ, మంగతాయారులకు కుమార్తె, కుమారుడు కాగా కుమార్తె బుర్ర లిడియా(12) పాల్వంచ గురుకుల పాఠశాలలో 5వ తరగతిలో సీటు లభించింది. పది రోజుల క్రితం గురుకులానికి వెళ్లిన లిడియా జ్వరం వచ్చిందని ఇంటికి తిరిగి వచ్చింది. అయితే తిరిగి గురుకుల పాఠశాలకు వెళ్లాలని గురువారం లిడియాను తల్లిదండ్రులు కోరారు. అయితే అక్కడికి వెళ్లేందుకు ఇష్టంలేని బాలిక తన ఇంట్లోనే సాయంత్రం 7 గంటలకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. గ్రామస్థుల సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని బాలిక మృత దేహాన్ని శుక్రవారం కొత్తగూడెం సర్వజన ఆసుపత్రిలో పోస్టుమార్టం అనంతరం తల్లిదండ్రులకు అప్పగించారు. కొత్తగూడెం 2వ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

4.5 కిలోల గంజాయి స్వాధీనం

చుంచుపల్లి, జూలై12: మండల పరిధిలోని రామవరం ప్రాంతంలో 4.5 కేజీల గంజాయిని కొత్తగూడెం టూటౌన్ పోలీసులు శుక్రవారం స్వాధీనం చేసుకున్నారు. స్థానిక పోలీస్ స్టేషన్ పరిధిలో సుభాష్‌చంద్రబోస్‌నగర్ వద్ద వాహనాల తనిఖీ చేస్తుండగా ఓ ద్విచక్రవాహనంపై వెళ్తున్న ముగ్గురు వ్యక్తులు అనుమానాస్పదంగా కన్పించారు. దీంతో పోలీసులు వాహనాన్ని తనిఖీ చేయగా వారి వద్ద 4.5కిలోల గంజాయిని గుర్తిం చినట్లు తెలిపారు. యువకులను అరెస్టు చేసి, వారి వద్ద నుంచి ద్విచక్రవాహనం, సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు.

వరదల సమయంలో అప్రమత్తత అవసరం

● గోదావరి సర్కిల్ డైరెక్టర్ శ్రీనివాస్ బైరి

భద్రాచలం, జూలై 12: గోదావరి వరదల సమయంలో కేంద్ర జల సంఘం అధికారుల అప్రమత్తత అవసరమని అందుకు అనుగుణంగా అధికారులు విధులు నిర్వహించాలని గోదావరి సర్కిల్ డైరెక్టర్ శ్రీనివాస్‌బైరి అన్నారు. భద్రాచలంలో శుక్రవారం ఆయన సీడబ్ల్యూసీ అధికారులతో కలిసి గోదావరి నదీ పరివాహాక ప్రాంతాన్ని పరిశీలించారు. ఇదే సమయంలో సీడబ్ల్యూసీ ఆధ్వర్యంలో గోదావరి ప్రవాహాన్ని అంచనా ఏడీసీపీ పరికరాన్ని స్వయంగా ఆయన పరిశీలించారు. కాగా ఇటీవల సీడబ్ల్యూసీ భద్రాచలం ఎస్‌డీఈగా బాధ్యతలు చేపట్టిన కె.పృథ్వీరాజ్‌తో కలిసి స్థానిక పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు.



నదీ ప్రవాహాన్ని పరిశీలిస్తున్న సీడబ్ల్యూసీ అధికారులు

స్తంభాద్రి ఆస్పత్రిలో బ్రెయిన్ ట్యూమర్ ఆపరేషన్



ఆపరేషన్ విజయవంతం అయ్యిందని చూపుతున్న డాక్టర్ సురేష్

ఖమ్మం కలెక్టరేట్, జూలై 12: స్తంభాద్రి ఆస్పత్రిలో బ్రెయిన్ ట్యూమర్ ఆపరేషన్‌ను విజయవంతంగా నిర్వహించినట్లు ఆస్పత్రి డాక్టర్ గట్టినేని సురేష్ తెలిపారు. వరంగల్ జిల్లాకు చెందిన లక్ష్మి అనే 85 ఏళ్ల మహిళ ఫిట్స్‌తో అపస్మారక స్థితిలోకి వెళ్లింది. ఈ క్రమంలో ఆమెను కుటుంబ సభ్యులు స్తంభాద్రి ఆస్పత్రి కి తీసుకురాగా, పరీక్షించి స్కానింగ్ పూర్తిచేసి మెదడులో గడ్డలు ఉన్నట్లు గుర్తించారు. 6 సెంటీమీటర్ల పరిధిలో స్పినోయిడ్ వింగ్ మెరిజోమో అని అంటారని తెలిపారు. ఈ తరహా సర్జరీలు అ త్యంత ఖర్చు, రిస్క్‌తో కూడుకున్నదని డాక్టర్లు తెలిపారు. ఈ నేపథ్యంలో హైదరాబాద్‌లో చేసే ఇలాంటి సర్జరీని అతితక్కువ ఖర్చుతో ఖమ్మంలోని స్తంభాద్రి ఆస్పత్రిలో నిర్వహించినట్లు తెలిపారు. ఆమె వారం రోజుల్లో కోలుకుని మామూలు స్థాయికి చేరుకుందని న్యూరో స్పెషలిస్ట్ గట్టినేని సురేష్ తెలిపారు. ఈ సందర్భంగా వైద్యులను, ఆస్పత్రి యాజమాన్యాన్ని పలువురు అభినందించారు.

తండ్రికి తలకొరివి పెట్టిన తనయ

కొణిజర్ల, జూలై12: అనారోగ్యంతో మృతి చెందిన తండ్రికి ఓ కూతురు తలకొరివి పెట్టిన సంఘటన మండలంలోని అమ్మపాలెం గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. అమ్మపాలెం గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ, సొసైటీ డైరెక్టర్, సీపీఐ నాయకుడు గుణగంటి వెంకటలక్ష్మీనారాయణ(47) అనారోగ్యంతో గురువారం అర్ధరాత్రి మృతి చెందాడు. అతడికి కుమారులు లేకపోవడంతో పెద్ద కుమార్తె రీతిక తండ్రికి తలకొరివి పెట్టింది. కాగా సీపీఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్, సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వర రావు, భద్రాద్రి కొత్తగూడెం కార్యదర్శి అన్నవరపు కనకయ్యతో పాటు పలువురు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.



తండ్రికి తలకొరివి పెడుతున్న కుమార్తె రీతిక

భద్రాద్రి రామాలయ చిత్రం బహుకరణ

● చిత్రాన్ని ఈవోకు అందించిన లావణ్య



ఈవోకు రామాలయ చిత్రాన్ని అందజేస్తున్న లావణ్య

భద్రాచలం, జూలై 12: భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి వారి ఆలయాన్ని తన కుంచెతో చిత్రీకరించిన యాదాద్రి జిల్లా భువనగిరికి చెందిన నామోజు లావణ్య శుక్రవారం భద్రాద్రి దేవస్థానం ఈవో ఎల్.రమాదేవికి చిత్రాన్ని అందజేశారు. లావణ్య భద్రాద్రి రామాలయ చిత్రాన్ని ఇటీవల చిత్రీకరిచేందుకు అనుమతులు పొంది, చిత్రాన్ని పూర్తి చేసింది. ఈవో క్యాంపు కార్యాలయంలో ఎల్.రమాదేవికి చిత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా లావణ్య ప్రతిభను ఈవో అభినందించి సత్కరించారు.

కారుణ్య నియామక పత్రాల అందజేత

ఖమ్మంకలెక్టరేట్, జూలై 12: కారుణ్య నియామకాల కింద ఎం లావణ్యకు ఎంపీపీ పెనుబల్లి ఆఫీసు సబర్డినేట్, ఎస్కే మదార్‌కు ముదిగొండ ఎంపీపీ ఆఫీసు సబార్డినేట్ గా నియమక పత్రాలను జిల్లా పరిషత్ చైర్మన్ లింగాల కమల్ రాజు శుక్రవారం అందచేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈవో ఎస్ వినోద్ , డిప్యూటీ సీఈవో నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



నియామక ఉత్తర్వులు అందజేస్తున్న జడ్పీ చైర్మన్ కమల్‌రాజ్

మొక్కలే మనిషి జీవనానికి ప్రాణాధారం

సత్తుపల్లి/సత్తుపల్లి రూరల్, జూలై 12: వన మహోత్సవంలో ప్రతిఒక్కరూ భాగస్వాములవ్వాలనే ఉద్దేశ్యంతో పట్టణంలోని ఎన్టీఆర్ నగర్ ప్రభుత్వ పాఠశాలలో శుక్రవారం విద్యార్థులు మొక్కలు నాటారు. సమస్త ప్రాణుల జీవన మనుగడకు చెట్లే ఆధారమని, భవిష్యత్ తరాలకు ఇబ్బందులు రాకుండా ఉండాలంటే మనిషికో మొక్క నాటి సంరక్షించాలని ఉపాధ్యాయలు జల మనుగడకు చెట్లు ఉండాలి కాబట్టి రహదారుల వెంబడి పండ్ల చెట్లు, వేప చెట్లు ఎక్కువగా పెంచేలా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని కోరారు.





సత్తుపల్లిలో మొక్కలు నాటుతున్న విద్యార్థులు, పోలీసుకు మొక్క అందజేస్తున్న ఎన్‌సీసీ విద్యార్థులు

సత్తుపల్లిరూరల్: మొక్కలు మనిషి జీవనానికి ప్రాణాధారణమని జేవీఆర్ ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కే.విజయ్‌కుమార్ అన్నారు. వన్ కేడట్ వన్ ప్లాంట్ అనే నినాదంతో శుక్రవారం ఎన్‌సీసీ కేడట్లు కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం జాతీయ రహదారిపై బాటసారులు, వాహనదారులకు మొక్కను అందించి నాటడంతో పాటు సంరక్షణ బాధ్యత తీసుకోవాలని విద్యార్థులు కోరారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ కేర్ టేకర్ రవికుమార్, ఎకో క్లబ్ కన్వీనర్ జీ.వీరన్న, ఐక్యూ ఏసీ కో-ఆర్డినేటర్ రామచంద్రరావు, డాక్టర్ సారంగపాణి, మధు, ఎన్‌సీసీ కేడెట్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని కాపాడండి: ప్రిన్సిపాల్

తిరుమలాయపాలెం: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు విధిగా మొక్కలు నాటి కాపాడాలని పిండిప్రోలు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. వనమహోత్సవంలో భాగంగా శుక్రవారం కళాశాలలో వివిధ రకాల మొక్కలను నాటారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పీవో రామయ్య, అధ్యాపకులు శ్రీనివాసరావు, చంద్రమౌళి పాల్గొన్నారు.

ఖాళీ ప్లాట్లు శుభ్రం చేయించకుంటే జరిమానా

- స్థలాల యజమానులకు కమిషనర్ అభిషేక్ అగస్త్య హెచ్చరిక
- నగరంలో 2, 4, 13 డివిజన్లలో పర్యటన

ఖమ్మంకార్పొరేషన్, జూలై12: ఖాళీప్లాట్లలో చెత్తపెరిగితే సదరు ప్లాట్ల యజమానులకు జరిమానాలు విధించాలని నగరపాలకసంస్థ కమిషనర్ అభిషేక్ అగస్త్య అధికారులను ఆదేశించారు. శుక్రవారం నగరంలోని 2,4,13 డివిజన్లలో పర్యటించి పారిశుధ్య నిర్వహణను తనిఖీ చేశారు. 2వ డివిజన్‌లో ఖాళీప్లాట్లలో పెరిగిన మొక్కలను పరిశీలించిన కమిషనర్ సదరు ప్లాట్లను శుభ్రం చేయించి, యజమానులనుండి సొమ్ములు వసూలు చేయాలన్నారు. అంతేకాకుండా యజమానులకు జరిమానాలు సైతం విధించాలన్నారు. అనంతరం 4వ డివిజన్‌లో పారిశుధ్య కార్మికులతో మాట్లాడి వారు ఏ సమయానికి వచ్చి, ఎప్పుడు విధులు ముగించుకొని వెళతారో అడిగి తెలుసుకున్నారు.తరువాత నూతనంగా నిర్మిస్తున్న రహదారులను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ డివిజన్‌లో మురుగుకాలువల పొడుగును పరిగణలోకి తీసుకొని, ప్రణాళిక ప్రకారం రోజువారీగా శుభ్రం చేయాలన్నారు. అలాగే మురుగునీరు ఆగిపోయిన ప్రాంతంలో కల్వర్టులను నిర్మించాలని నగరపాలకసంస్థ ఈఈని ఆదేశించారు. వర్షాకాలం సందర్భంగా కాలువల పూడికతీత పనులపై దృష్టి పెట్టాలని, ఎక్కువ మంది కార్మికులను వినియోగించాలని పారిశుధ్య జవాన్లను కమిషనర్ ఆదేశించారు. కొత్తగా నిర్మించిన రహదారులకు క్యూరింగ్ తప్పనిసరిగా చేయాలన్నారు. అనంతరం కమిషనర్ అభిషేక్ అగస్త్య రోటరీనగర్‌లోని రైతుబజార్‌ను సందర్శించి, అక్కడ వ్యాపారులు లేక ఎందుకు ఖాళీగా ఉందని ప్రశ్నించారు. వ్యాపారులు ఎందుకు కూరగాయలు విక్రయించటానికి రావటంలేదో మార్కెట్ అధికారులు తెలుసుకొని, తనకు తెలపాలన్నారు. ఈ కార్యక్రమాల్లో కమిషనర్ వెంట సహాయ కమిషనర్ సంపత్‌కుమార్, ఈఈ కృష్ణాలాల్, డీఈ ధరణికుమార్, కార్పొరేటర్లు మలీదు వేంకటేశ్వర్లు, రొత్తపల్లి నీరజ,శానిటేషన్ ఇన్స్‌పెక్టర్లు, జవాన్లు పాల్గొన్నారు.



2వ డివిజన్‌లో ఖాళీప్లాట్‌లో పెరిగిన చెత్తను చూస్తున్న కమిషనర్ అభిషేక్ అగస్త్య

బొగ్గు గనుల వేలానికి వ్యతిరేకం



నినాదాలు చేస్తున్న సత్తుపల్లి నాయకులు

సత్తుపల్లిరూరల్, జూలై 12: బొగ్గు గనుల వేలానికి తామంతా వ్యతిరేకమని సత్తుపల్లి సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ బ్రాంచ్ కార్యదర్శి సముద్రాల సుధాకర్ అన్నారు. తెలంగాణాలో కేంద్ర ప్రభుత్వం తలపెట్టిన బొగ్గు గనుల వేలాన్ని వ్యతిరేకిస్తూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలో శుక్రవారం చేపట్టిన రిలే నిరాహార దీక్షలో సత్తుపల్లి బ్రాంచ్ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ అసిస్టెంట్ కార్యదర్శి సూర్యప్రకాష్, జాయింట్ కార్యదర్శి భరణి, జేవీఆర్ పిట్ కార్యదర్శి నరసింహారావు, కిష్టారం పిట్ కార్యదర్శి కిషోర్‌కుమార్, జీనాగేశ్వరరావు, యాదయ్య, వీరభద్రు, మోతీలాల్, కోటేశ్వరరావు, వినయ్‌కుమార్, జయరాజు, నరేందర్, తిరుపతి, మహేష్, రాంమోహన్, శ్రావణ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసరాల అందజేత

కారేపల్లి జూలై 12: మండల కేంద్రంలో పంచాయతీ కార్మికులకు శుక్రవారం మాజీ వార్డుసభ్యుడు,జిల్లా మైనార్టీ సంఘం నాయకుడు ఎస్‌కె.గౌస్దీన్ పంచాయతీ కార్మికులకు బియ్యంతో పాటు నిత్యవసర వస్తువులను పంపిణీచేశారు. కార్మికులకు 6నెలలుగా వేతానాలు రాకపోవడంతో వారి ఇబ్బందులను గుర్తించి గౌస్‌వారికి నిత్యావసరాలు అందజేశారు. కార్యక్రమంలో లచ్చయ్య, కొమరయ్య,సుల్తానా, యాదగిరి,ఉమా,పద్మ,శ్రీను,తిరుపతయ్య, అచ్చయ్య, గౌతం తదితరులు పాల్గొన్నారు.

మెరిట్ స్కాలర్‌షిప్‌కు శ్రీవాణి విద్యార్థులు

సత్తుపల్లిరూరల్, జూలై 12: 2024విద్యా సంవత్సరానికి గానూ నేషనల్ మెరిట్ స్కాలర్‌షిప్‌కు సత్తుపల్లిలోని శ్రీవాణి బాలికల కళాశాల విద్యార్థులు 45మంది ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ పాలా ప్రవీణ్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. విద్యార్థులను యాజమాన్యం, అధ్యాపకులు అభినందించారు.

జగన్మోహనరావుకు దయానంద్ నివాళి

సత్తుపల్లిరూరల్, జూలై12: రిటైర్డ్ ఎంపీడీవో కంకిపాటి జగన్మోహనరావు (76) అనారోగ్యంతో మృతిచెందారు. సత్తుపల్లి పట్టణంలోని తోట వెంకట్రావు వీధిలోని ఆయన భౌతిక కాయాన్ని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ విజయకుమార్‌తో పాటు విశ్రాంతి ఉద్యోగుల సంఘ బాధ్యులు, సహోద్యోగులు సందర్శించి నివాళులర్పించారు. విశ్రాంతి ఉద్యోగుల సంక్షేమంతో పాటు తెలంగాణ రాష్ట్ర ఉద్యమంతో పాటు సత్తుపల్లి జిల్లా సాధనలో జగన్మోహనరావు చేసిన సేవలను కొనియాడారు.

నాలుగోతరగతి ఉద్యోగులకు ఉచితంగా క్వార్టర్లు కేటాయించాలి

ఖమ్మంకార్పొరేషన్, జూలై 12: ఖమ్మం నగరపాలకసంస్థ కార్యాలయంలో సుదీర్ఘకాలంగా పనిచేస్తున్న నాలుగోతరగతి ఉద్యోగులకు ఉచితంగా క్వార్టర్లు కేటాయించాలని సంఘం నగర అధ్యక్ష, కార్యదర్శులు బుర్రి వేంకటేశ్వర్లు, మల్లెపాక బంగారి కోరారు. శుక్రవారం నగరంలోని టీఎన్జీవోస్ ఫంక్షన్ హాల్‌లో సంఘం ప్రథమ మహాసభను నిర్వహించారు. అనంతరం టీఎన్జీవోస్ జిల్లానాయకులు బుల్లెట్ శ్రీను జెండా ఆవిష్కరించి మహాసభను ప్రారంభించారు. ఈ మహాసభలో సంఘం నగర అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ రేవతిసెంటర్‌లోని క్వార్టర్లను తమకు కేటాయించాలని కోరారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడిగా సూరేపల్లి శ్రీనివాస్, గౌరవ సలహాదారుడిగా కే.మల్లయ్య, నగర అధ్యక్ష, కార్యదర్శులుగా బుర్రి వేంకటేశ్వర్లు, మల్లెపాక బంగారి, కోశాధికారిగా కుక్కల చంద్రశేఖర్, ఉపాధ్యక్షులుగా బచ్చలకూర సైదులు, దేవరకొండ రమేష్, మహిళా అధ్యక్షురాలిగా సీహెచ్, గోపమ్మ, వర్కింగ్ అధ్యక్షుడిగా దుర్గాప్రసాద్‌తో పాటు ఈసీ సభ్యులను ఎన్నుకున్నారు.

కల్లు గీత కార్మికుల హామీలను నెరవేర్చాలి

- సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు డిమాండ్

ఖమ్మం సంక్షేమ విభాగం, జూలై 12: కల్లు గీత కార్మికులకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ పార్టీ అమలుచేయాలని, జీవో నెంబర్ 560 మేరకు ప్రతి కల్లుగీత సొసైటీకి ఐదేకరాలు భూమి కేటాయించాలని కల్లు గీత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బెల్లంకొండ వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. శుక్రవారం ఖమ్మంలో సంఘం జిల్లా అధ్యక్షులు బొడపట్ల సుదర్శన్ అధ్యక్షతన నిర్వహించిన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇప్పటి వరకు రాష్ట్ర వ్యాప్తంగా 520 మంది ప్రమాదాలకు గురైతే వారిలో 76 మంది మరణించారని ప్రభుత్వం నుంచి ఎటువంటి సహాయం అందలేదని ఆరోపించారు. నాయకులు కొండం కరుణాకర్, మోటుపోతుల వెంకటేశ్వర్లు, కాసాని రమేశ్, మెక్క నాగేశ్వరరావు, బొల్లికొండ పాపయ్య, మల్ల వెంకటయ్య పాల్గొన్నారు.

మహిళ అదృశ్యంపై కేసు

కల్లూరు, జూలై 12: మండలంలోని ఓ గ్రామంలో మహిళ అదృశ్యంపై స్థానిక పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. ఈ సంఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన సమాచారం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. మండల పరిధిలోని ఓ గ్రామంలో ఈ నెల 10న ఉదయం 9 గంటల సమయంలో సదరు మహిళ సెంటర్‌కు వెళ్లి వస్తానని వెళ్లి ఇంత వరకు తిరిగి రాలేదు. దీంతో బాధిత మహిళ అన్నయ్య పిర్యాదుతో ఎస్ఐ ఎస్‌కే షాకీర్ మహిళ అదృశ్యంగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

చింతకాని, కారేపల్లికి బీజేపీ మండల అధ్యక్షుల ఎంపిక

చింతకాని/కారేపల్లి, జూలై 12: బీజేపీ పార్టీ మండల అధ్యక్షునిగా నాగులవంచ గ్రామానికి చెందిన కొండా గోపిను ఎంపిక చేసినట్లు జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారయణ తెలిపారు. గోపి ఇప్పటి వరకు బీజేపీ యువమోర్చా మండల అధ్యక్షునిగా పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొన్నారు. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పజెప్పిన జిల్లా పార్టీ నాయకులకు సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. గోపికు పలువురు మండల నాయకులు, ప్రజాప్రతినిధులు శుభాకాంక్షలు తెలిపారు.


కారేపల్లి: బీజేపీ మండల అధ్యక్షుడిగా మేకల మల్లేష్‌ను జిల్లా పార్టీ అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ నియమించారు. శుక్రవారం ఖమ్మం జిల్లా కేంద్రంలో పార్టీ కార్యాలయంలో ఎంపిక చేశారు. ఈకార్యక్రమంలో మండలానిచెందిన పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

టర్మ్ లైఫ్ బీమాను సద్వినియోగం చేసుకోండి

నేలకొండపల్లి, జూలై12: యూనియన్ బ్యాంకు, జీవిత బీమా సంస్థలు సంయుక్తంగా చేస్తున్న టర్మ్ లైఫ్ బీమా పాలసీలను యూనియన్ బ్యాంకు వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని నేలకొండపల్లి యూనియన్ బ్యాంకు మేనేజర్ వి.రాజేశ్వరరావు కోరారు. వడదెబ్బకు గురై మృతి చెందిన నేలకొండపల్లికి చెందిననూదాని వెంకయ్య భార్య వీరమ్మకు శుక్రవారం రూ.10 లక్షల విలువైన భీమా చెక్కును రాజేశ్వరరావు బ్యాంకులో జరిగిన కార్యక్రమంలో అందజేశారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరూ యూనియన్ బ్యాంకు, లైఫ్ ఇన్సూరెన్స్ సంస్థలు జాయింట్‌గా నిర్వహిస్తున్న పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని మేనేజర్ రాజేశ్వరరావు కోరారు. కార్యక్రమంలో బ్యాంకు అధికారులు వంగవేటి లక్ష్మణ్‌కుమార్, శ్రీకాంత్, వాసు, రామకృష్ణ, సావిత్రమ్మలతో పాటుగా మృతుని కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

తవ్వేశారు.. వదిలేశారు..

సత్తుపల్లి, జూలై12: తవ్వేశారు.. నిర్లక్ష్యంగా వదిలేశారు.. అనే పదానికి నిలువుటద్దంలా ఉంది మునిసిపల్ అధికారులు, సిబ్బంది తీరు. సత్తుపల్లి పట్టణంలోని శ్రీ కృష్ణమందిరం సమీపంలోని రాజీవ్‌రోడ్డుకు వెళ్లేదారిలో పైపులైన్ల మరమ్మతుల నిమిత్తం వారం రోజుల క్రితం గుంతలు తవ్వారు. వాటిని ఇప్పటి వరకు పూడ్చకపోవడంతో అటువైపు వెళ్లే చిన్నారులు, వృద్ధులతో పాటు వాహనదారులు, ప్రజలు రాకపోకల సమయంలో ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇంకా పూడ్చకపోవడంతో ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉందని, వెంటనే గుంతలను పూడ్చి రహదారిని పూర్తి స్థాయిలో వాడుకలోకి తీసుకురావాలని ఆ ప్రాంత ప్రజలు అధికారులను కోరుతున్నారు.



రాజీవ్‌రోడ్డు వద్ద నిర్లక్ష్యంగా తవ్వి వదిలేసిన గుంతలు

బదిలీ ఉపాధ్యాయులకు ఆత్మీయ సన్మానం

తల్లాడ, జూలై 12 తల్లాడ మండలం కుర్నవల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులకు గ్రామస్థులు శుక్రవారం ఆత్మీయ వీడ్కోలు పలికారు. ఇటీవల పాఠశాల నుంచి పదకొండు మంది ఉపాధ్యాయులు బదిలీఅయినారు. బదిలీపై వెళుతున్న ఉపాధ్యాయులకు గ్రామస్థులంత ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ ఐలూరి ప్రదీప్‌రెడ్డి, మాజీ చైర్మన్ ఐలూరి లక్ష్మారెడ్డి, స్థానిక ప్రముఖులు ఐలూరి శేషిరెడ్డి, వెంకటకోటారెడ్డి (బాబు), పుల్లారెడ్డి, ఎస్‌కే మదార్‌సాహెబ్, గంటల వెకటాచారి, కట్టా దర్గయ్య తదితరులు పాల్గొన్నారు.

డెంగ్యూ పట్ల కార్పొరేషన్ అధికారుల అప్రమత్తం

ఖమ్మంకార్పొరేషన్, జూలై 12: నగరంలోని రోటరీనగర్, రామన్నపేటలలో డెంగ్యూ కేసులు నమోదు కావటంతో నగరపాలకసంస్థ అధికారులు అప్రమత్తం అయ్యారు. శుక్రవారం నగరపాలకసంస్థ, మెప్మా, మలేరియా సిబ్బంది, ఏఎన్ఎంలు, శానిటరీ ఇన్స్‌పెక్టర్లు, జవాన్లు ఆయా ప్రాంతాల్లో ఫ్రైడే, డ్రైడే నిర్వహించారు. తమ ఇంటిపరిసరాల్లో నీళ్ల నిలువకుండా చూడాలని అక్కడి ప్రజలను కోరారు. ఇంటి పరిసరాల్లో ఉన్న మొక్కలను తొలగించాలని సూచించారు.

సాదాసీదాగా సర్వసభ్య సమావేశం

ఏన్కూరు, జూలై 12: ఎంపీపీ ఆరెం వరలక్ష్మి అధ్యక్షతన శుక్రవారం జరిగిన ఏన్కూరు మండల సర్వసభ్య సమవేశం సాదాసీదాగా జరిగింది. హెల్త్‌క్యాంపులు నిర్వహించడం లేదని తిమ్మరావుపేట ఎంపీటీసీ లచ్చిరాంనాయక్ వైద్యసిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామాల్లో పారిశుధ్యం లోపించిందని డ్రైడే ఫ్రైడే కార్యక్రమాలు నిర్వహించడంలేదని, మిషన్ భగీరథ తాగునీరు సక్రమంగా సరఫరా కావడంలేదని సంబంధిత అధికారులను నిలదీశారు. ఈసమావేశంలో ఎంపీపీ ఆరెం. వరలక్ష్మి, జడ్పీటీసీ బాదావత్ బుజ్జి, వైస్ ఎంపీపీ పాశం శ్రీనివాసరావు, ఎంపీడీవో ఎస్. రమేష్ తహసీల్దార్ సీహెచ్.శేషగిరిరావు, ఏవో నరసింహారావు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు వెంకటమ్మ, రేఖాబాయ్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

ఖమ్మంకార్పొరేషన్, జూలై 12: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవటం ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని 51వ డివిజన్ కార్పొరేటర్ శీలంశెట్టి రమావీరభద్రం పేర్కొన్నారు. శుక్రవారం డివిజన్‌లో నిర్వహించిన ఫ్రైడే, డ్రైడే కార్యక్రమంలో పాల్గొన్న కార్పొరేటర్ ప్రతి ఇంటికీ తిరిగి, నిల్వ ఉన్న నీటిని తొలగించారు. కూలర్లు, గాబుల్లో నిల్వ ఉన్న నీటిని వెంటనే తొలగించాలని స్థానికులకు అవగాహన కల్పించారు. వర్షాకాలంలో సీజనల్‌వ్యాధులు ప్రబలుతున్నాయని, అందుకే నీరు నిల్వకుండా చూడాలని కార్పొరేటర్ కోరారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశావర్కర్లు, మెప్మా ఆర్పీలు పాల్గొన్నారు.

ఫిజియోథెరపీ శిబిరం

కల్లూరు, జూలై 12 మండల పరిధిలోని పేరువంచ గ్రామంలో శుక్రవారం అవయ లోపం గల పిల్లలకు సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో ఉచిత ఫిజియోథెరపీ వైద్య శిబిరం నిర్వహిచారు. నడవలేని, కదలలేని పరిస్థితిలో మంచానికి పరిమితమైన పిల్లలకు ఫిజియోథెరిపీ చేయటం ద్వార మంచి ఫలితాలు వస్తాయిని ఫిజియోథెరిపీ వైద్యుడు మాగంటి ప్రభాకర్ తెలిపారు. ఈ శిబిరంలో అవయలోపం, గల పిల్లలకు ఫిజియోథెరపీ చేశారు. ఇంకాను కండరాలు, కీళ్లు పట్టుకుపోయిన కూడా వ్యాయాయం ద్వారా తగ్గించవచ్చు, పిల్లల్లో మార్పులను గమనించవచ్చునని దీంతో ఇలాంటి శిబిరాలను వినియోగించుకోవాలని వైద్యుడు ప్రభాకర్ కోరారు. ఈ కార్యక్రమంలో ఐఈ ఆర్పి వై సుధారణి, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు ఏజెన్సీ ప్రాంతాలుగా బదిలీలు కల్పించాలి

ఖమ్మంచర్చికాంపౌండ్, జూలై12: రాష్ట్రంలో ఆర్టికల్ 244(1) అనుసరించి యాజమాన్యాల వారీగా ఉపాధ్యాయులకు, మైదాన, ఏజెన్సీ ప్రాంతాలుగా విడివిడిగా బదిలీలు, పదోన్నతుల కల్పించాలని సేవాలాల్ సేన ఆధ్వర్యంలో జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోత్ హుస్సేన్ నాయక్‌కు శుక్రవారం వినతిపత్రం అందించారు. ఏజెన్సీ ప్రాంతాల్లో ఉపాధ్యాయులకు వంద శాతం పదోన్నతులు షెడ్యూల్ ట్రైబల్స్‌కు ఇప్పించాలని, అలా కుదరని పక్షాన ఏజెన్సీల్లో, పదోన్నతుల నిలుపుదల చేయాలని ప్రకటనలో కోరినట్టు సేవాలాల్ సేన రాష్ట్ర రైతు సంఘం నాయకులు బానోత్ కిషన్‌నాయక్ తెలిపారు. ఈకార్యక్రమంలో జిల్లా కన్వీనర్ బానోతు శ్రీకాంత్, సురేష్‌నాయక్, బాబురావునాయక్, రాందాస్‌నాయక్, రాజ్‌కుమార్, రామ్మూర్తి పాల్గొన్నారు.

జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడిని కలిసిన గిరిజన ఉద్యోగస్థుల సంఘం

ఖమ్మంచర్చికాంపౌండ్, జూలై 12: ఖమ్మం పర్యటనకు వచ్చిన జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోత్ హుస్సేన్‌నాయక్‌ను అఖిల భారత ఉద్యోగస్తుల సంఘం అధ్యక్షుడు టీవీ రమణ, భూక్యా శోభన్, గరిక శ్రీనివాస్, డాక్టర్ డి.శంకర్‌లు కలిసి పుష్పగుచ్ఛం అందించారు. గిరిజన ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని వినతిపత్రం అందించారు.



పుష్పగుచ్ఛం అందిస్తున్న సంఘం నాయకులు

పర్మినెంట్ ఈఎస్ఐ ఆస్పత్రి ఏర్పాటుచేయాలి

ఖమ్మంకార్పొరేషన్, జూలై12: ఖమ్మం నగరపాలకసంస్థ కార్యాలయంలో పనిచేస్తున్న కార్మికులకు పర్మినెంట్ ఈఎస్ఐ ఆస్పత్రిని ఏర్పాటు చేయాలని కోరుతూ ఇఫ్టూనేతలు శుక్రవారం నగరపాలకసంస్థ సహాయ కమిషనర్ సంపత్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. తెలంగాణా ప్రగతిశీల మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు జీ.రామయ్య మాట్లాడుతూ నగరాన్ని పరిశుభ్రంగా ఉంచుతున్న నగరపాలకసంస్థ పారిశుధ్య కార్మికులకు జబ్బులు వస్తే ఖమ్మం మయూరి ఆస్పత్రిలో ఈఎస్ఐ ఆస్పత్రిని ఏర్పాటు చేశారని, అయితే కార్మికులు జబ్బుతో అక్కడికి వెళితే మందులు ఇచ్చే పరిస్థితి లేదన్నారు. వివిధ రకాల పరీక్షలు సైతం బయట చేయించుకోవాలంటున్నారన్నారు. వెంటనే పర్మినెంట్ ఈఎస్ఐ ఆస్పత్రి ఏర్పాటు చేయాలని కోరారు.కార్యక్రమంలో ఇఫ్టూ నగర అధ్యక్ష, కార్యదర్శులు ఎం.లక్ష్మీనారాయణ, కే.శ్రీనివాస్, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు గురవయ్య, కిన్నెర నారాయణ, వీరబాబు,యాదక్క పాల్గొన్నారు.

టీడీపీకి నామినేటెడ్ పోస్టులు ఇవ్వాలి

ఖమ్మం లీగల్ జూలై 12: నామినేటెడ్ పోస్టుల్లో టీడీపీ నాయకులకు అవకాశం కల్పించాలని ఆ పార్టీ లీగల్ సెల్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి, సీనియర్ న్యాయవాది గొల్లపూడి రామారావు అన్నారు. ఈ మేరకు టీడీపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ వాసిరెడ్డి రామనాథంను గురువారం మధిరలో కలిసి వినతి పత్రం సమర్పించారు. ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్‌పార్టీకి టీడీపీ సహకరించటం వల్లే భారీ విజయం సాధించామని ఆ పార్టీ నాయకులే టీడీపీ కార్యాలయానికి వచ్చి చెప్పారని, జై తెలుగుదేశం అన్నారని గుర్తు చేశారు. జిల్లాలో కాంగ్రెస్ విజయానికి సహకరించిన టీడీపీ నాయకులకు కూడా నామినేటడ్ పోస్టుల్లో అవకాశం కల్పించేలా చూడాలని డాక్టర్ వాసిరెడ్డి రామనాథం ను కోరారు. ఈ అంశాన్ని జిల్లాకు చెందిన ముగ్గురు మంత్రుల దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. టీడీపీ లీగల్ సెల్ నాయకులు తోటకూర శ్రీనివాసరావు, మువ్వా నాగేశ్వరరావు, కొండపల్లి శ్రీనివాస్‌చౌదరి తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు బీరువాల వితరణ

కారేపల్లి జూలై 12: మండల పరిధిలోని విశ్వనాధపల్లి గ్రామానికి చెందిన చెరికూరి నర్సింహరావు,ధనలక్ష్మీ జ్ఞాపకార్థం వారి కుమారుడు చెరికూరి వేణుమధావ్ స్థానిక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలకు ఇనుప బీరువాలను వితరణగా అందచేశారు. పాఠశాలలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో గ్రామానికి చెందిన మేదరమెట్ల ప్రేమ్‌చందు, తాతా వెంకటేశ్వర్లు, తాతా రవికుమార్ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పద్మకు అందజేశారు. వారు మాట్లాడుతూ కారేపల్లి క్రాస్‌రోడ్డులో రూ.మూడు లక్షలతో ప్రయాణికుల సౌకర్యం కోసం బస్‌షెల్టర్ ఏర్పాటుచేశామన్నారు. మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టనున్నట్లు గ్రామస్థులు తెలిపారు.

వృద్ధులకు అన్నదానం

వైరా, జూలై 12: మండలంలోని గొల్లపూడిలో ఉన్న వృద్ధాశ్రమంలోని వృద్ధులకు వైరా లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం అన్నదానం చేశారు. చింతలపూడి జోగమ్మ వర్ధంతి సందర్భంగా స్వీట్లు పంపిణీ చేసి అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. లయన్స్‌క్లబ్ నిర్వాహకులు చింతలపూడి వెంకటేశ్వరరావు, చింతోజు నాగేశ్వరరావు, కొల్లా రాంబాబు, కట్ల సురేష్, రాము, ఏలూరి నర్సింహారావు పాల్గొన్నారు.

ఖమ్మంలో పీరీల ఊరేగింపు



పీరీల ఊరేగింపు

ఖమ్మంసాంస్కృతికం, జూలై 12: ఖమ్మంలో పీరీ ఊరేగింపు భక్తులను ఆకర్షించింది.. అద్దద్ద లాల్ సాబ్ పీరీని గ్రామీణ ప్రాంతంలో భక్తిశ్రద్ధలతో కొలుస్తారు. స్వామికి ఏటా ఉర్సు ఉత్సవాలు సైతం జరుపుతారు. డోర్నకల్ మండలం వెన్నారం తండాలో ప్రతిష్ఠించిన పీరీని భక్తులు గ్రామ గ్రామ ఊరేగింపులో బాగంగా శుక్రవారం ఖమ్మం చేరుకుంది. ఈపీరీని కుల మతాలకు అతీతంగా భక్తులు ఎదురేగి స్వాగతించారు. నీళ్లు కుమ్మరించి కొబ్బరి కాయలు, కానుకలు సమర్పించారు.

ఇన్ఫోసిస్ క్యాంపస్ సందర్శించిన ప్రియదర్శిని విద్యార్థులు

ఖమ్మం రూరల్, జూలై 12: మండల పరిధిలోని పెద్దతండాలోని ప్రియదర్శిని మహిళా ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన తృతీయ సంవత్సం బి.టెక్ మరియు బిసీఏ విద్యార్థినులు టాస్క్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ప్రముఖ బహుళజాతి సంస్థ అయిన ఇన్ఫోసిస్ ఎస్ఈ జెడ్ క్యాంపస్‌ను శుక్రవారం సందర్శించినట్లు కళాశాల చైర్మన్ డాక్టర్ కాటేపల్లి నవీన్ బాబు తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ బి.గోపాల్, ఆధ్యాపక బృందం సంధ్యారాణి, వై.వి.రాణి, విశైలజ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల హాజరుశాతాన్ని పెంచాలి



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న జడ్పీ చైర్మన్


చింతకాని, జూలై 12: విద్యార్థుల హాజరుశాతంపై ఉపాధ్యాయులు దృష్టిసారించాలని జడ్పీ చైర్మన్ లింగాల కమల్ రాజు అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని పందిళ్లపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలను ఆయన సందర్శించారు. పాఠశాల రికార్డులను పరిశీలించి ఉపాధ్యాయులు, విద్యార్థులతో మాట్లాడారు. మధ్యాహ్న భోజన పథక నాణ్యతను పరిశీలించారు. పాఠశాలలో మౌలిక వసతుల కల్పన తదితర విషయాలపై చర్చించారు. కార్యక్రమంలో ఎంపీడీవో రామయ్య, ఎంపీవో రవీంద్రప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పెండింగ్ స్కాలర్‌షిప్‌లు చెల్లించాలి

- ఎస్ఎఫ్ఐ, పీడీఎస్‌యూ ఆందోళన

ఖమ్మం సంక్షేమ విభాగం/మధిర, జూలై 12: ప్రభుత్వం విద్యార్థులకు చెల్లించాల్సిన స్కాలర్‌షిప్‌లను వెంటనే మంజూరు చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ప్రవీణ్ డిమాండ్ చేశారు. శుక్రవారం విద్యార్థులతో కలిసి కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. నాయకులు సంగీత, సాయిశేషు, రాజు, ప్రమేకుమార్ పాల్గొన్నారు.

మధిర: విద్యార్థులకు పెండింగ్ ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయంబర్స్ మెంట్ బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో విద్యార్థులు శుక్రవారం సాయంత్రం మధిరలో ర్యాలీ, రాస్తారోకో చేశారు. ప్రధాన వీధుల్లో నిరసనగా ర్యాలీ నిర్వహించి టుటౌన్‌లోని ఆర్‌వోబీ సెంటర్లో సర్కిల్‌గా ఏర్పడి రాస్తారోకో చేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి వీ వెంకటేష్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థులకు రూ.8వేల కోట్లు స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయంబర్స్‌మెంట్ పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజనం పథకం అమలుచేయాలని, పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయంబర్స్ మెంట్ వెంటనే చెల్లించాలని, విద్యాసంస్థల్లో కనీస సదుపాయాలు ఏర్పాటుచేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే పెద్దఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో విద్యార్థి సంఘం నాయకులు అనూష, శైలజ, స్పందన, సాయి, రాకేష్, సురేష్, అనిల్, మనోజ్, కావేరి, అలేఖ్య తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

వీధికుక్కలు, కోతుల సమస్యను పరిష్కరించండి



కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్

ఖమ్మంకార్పొరేషన్, జూలై 12: నగరంలోని 12వ డివిజన్‌లో కుక్కల, కోతుల సమస్యను పరిష్కరించాలని కార్పొరేటర్ చిరుమామిళ్ల లక్ష్మీనాగేశ్వరావు శుక్రవారం నగరపాలకసంస్థ కమిషనర్ అభిషేక్ అగస్త్యను కలిసి వినతిపత్రం అందజేశారు. డివిజన్‌లో పాఠశాలలు ఎక్కువగా ఉన్నాయని, వీధి కుక్కలు, కోతులు విపరీతంగా సంచరిస్తుండటంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు భయపడి, ప్రమాదాలకు గురవుతున్నారన్నారు. వెంటనే చర్యలు తీసుకోని, వీధికుక్కలు, కోతుల బెడదను పరిష్కరించాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

సత్తుపల్లిరూరల్/నేలకొండపల్లి/వైరా/పెనుబల్లి, జూలై 12: సత్తుపల్లి మండలంలోని గౌరిగూడెం 33/11కేవీ సబ్ స్టేషన్ మరమ్మతుల నిమిత్తం సబ్ స్టేషన్ పరిధిలో ఉదయం 8.30నుంచి 10.30వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు ఏఈ శరత్‌బాబు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలోని గౌరిగూడెం, కొత్తూరు, రేజర్ల, కిస్లే ఫ్యాక్టరీ ఏరియా, రాజీవ్‌నగర్ ప్రాంతాలలో సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

●నేలకొండపల్లి:మండల పరిధిలోని కొత్తకొత్తూరు విద్యుత్ సబ్-స్టేషన్ పరిధిలో విద్యుత్ మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు నేలకొండపల్లి విద్యుత్ ఏఈఈ కుక్కల రామారావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కొత్తకొత్తూరు సబ్-స్టేషన్ పరిధిలోని కొత్తకొత్తూరు, పాతకొత్తూరు, తిరుమలాపురం, పైనంపల్లి, బోదులబండ, రామచంద్రాపురం, కోనాయగూడెం, కోరట్లగూడెం గ్రామాలతో పాటుగా నేలకొండపల్లిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

●వైరా: మండలంలోని గరికపాడు విద్యుత్ సబ్‌స్టేషన్ మరమ్మతుల కోసం శనివారం ఏడు గ్రామాలకు కరెంట్ సరఫరా నిలిపివేస్తున్నామని ట్రాన్స్‌కో వైరా రూరల్ ఏఈ పాలేటి వెంకటసాయి తెలిపారు. నారపనేనిపల్లి, విప్పలమడక, లింగన్నపాలెం, గరికపాడు, దాచాపురం, గన్నవరం, గోవిందాపురం గ్రామాలకు శనివారం ఉదయం 8నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు పూర్తిగా కరెంట్ సరఫరా బంద్ చేస్తామని పేర్కొన్నారు. మధ్యాహ్నం 12నుంచి 2గంటల వరకు కేవలం సింగిల్‌ఫేస్ కరెంట్ సరఫరా మాత్రమే ఇస్తామని వినియోగదారులు తమకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

●పెనుబల్లి: పెనుబల్లిలో 33/11కేవీ విద్యుత్ ఉపకేంద్రంలో మరమ్మతుల దృష్ట్యా శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేయటం జరుగుతుందని ఏఈ రవితేజ తెలిపారు. శనివారం ఉదయం 9.30గంటల నుంచి మధ్యాహ్నం 12.30గంటల వరకు పెనుబల్లి, వీఎంబంజర్, రామచంద్రరావుబంజర్, టేకులపల్లి, బయ్యన్నగూడెం, నాయకులగూడెం గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని వినియోగదారులు తమకు సహకరించాలని కోరారు.